


శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక

శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 276 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ మంగళవారం - 16 - జూన్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



### రాష్ట్రంలో యూఎన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

## ఏర్పాటుకు ప్రతిపాదన

**తీరప్రాంత నగరాల రక్షణ, మురికివాడల అభివృద్ధిపై చర్చ**

- తీరప్రాంత నగరాల రక్షణకు 'రైజప్'.. యూఎన్ హాబిటాట్‌కు సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- సింగపూర్‌లో యూఎన్ హాబిటాట్ డైరెక్టర్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- సీఎం ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన యూఎన్ ప్రతినిధులు

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రోస్‌బాక్‌తో ఆయన సమావేశమై మిగతా 2 లో



### విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపు

- 'కాక్రోచ్ జనతా పార్టీ'పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు.. సుమతీ శతకంతో పోలిక!
- ఢిల్లీలో జనసేన పార్టీ సమావేశం
- కాక్రోచ్ జనతా పార్టీపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు

# పెట్టుబడులకు భారత్ స్వర్గధామం..

## సింగపూర్‌లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు

- రాష్ట్ర అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం కావాలి: సీఎం చంద్రబాబు
- భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో భేటీ
- ఏపీ అభివృద్ధిలో సింగపూర్‌ను కీలక భాగస్వామిని చేయాలన్న చంద్రబాబు
- ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచన
- ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందన్న సీఎం



అమరావతి: ఏపీలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నేడు సింగపూర్‌లోని భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని, ఇక్కడి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని చంద్రబాబు కోరారు. భారతదేశానికి, సింగపూర్‌కు మధ్య ఉన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను ఈ సందర్భంగా హై కమిషనర్ అంబులే ముఖ్యమంత్రికి మిగతా 2 లో

పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

## అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ



ఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని మిగతా 2 లో

### హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక డిప్యూటీ సీఎం భట్టి

- హైదరాబాద్ సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిదర్శనమన్న భట్టి విక్రమార్క



- మ్యూజియం 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, డిప్యూటీ సీఎం

అమరావతిలో సింగపూర్ వర్సిటీ...

## విద్యారంగంలో ముందడుగు

### ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా సీఎం చంద్రబాబు..

- గూగుల్, ఎన్‌యూఎస్‌తో కీలక భేటీలు
- గూగుల్ క్లౌడ్, సింగపూర్ వర్సిటీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీని ఏఐ, డేటా హబ్‌గా మార్చేందుకు గూగుల్ తో కీలక చర్చలు



అమరావతి: సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు వివిధ సంస్థలతో వరుస భేటీలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. ఏపీని టెక్నాలజీ, విద్యారంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గూగుల్ క్లౌడ్, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా మిగతా 2 లో

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

### మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

సీఎం రేవంత్ రెడ్డి

- కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌పై రేవంత్ విమర్శలు
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:ఐఆర్ఎఫ్‌సీ రుణం నిలిపేశారన్న వాదన
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:ఎన్ఓసీ ఇస్తే చాలన్న సీఎం
- మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు:బీజేపీ,



బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్ : హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన మిగతా 2 లో

### 33 ఏళ్లలో తొలిసారి..

## స్లోవేకియా గడ్డపై భారత ప్రధాని

- 1993 తర్వాత తొలిసారి స్లోవేకియాలో భారత ప్రధాని పర్యటన
- భారత్-స్లోవేకియా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం
- స్లోవేకియా అధ్యక్షుడు, ప్రధానమంత్రితో మోదీ కీలక చర్చలు
- రక్షణ, ఏఐ, ఆటోమొబైల్ రంగాలపై ప్రధానంగా దృష్టి
- పర్యటన అనంతరం ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు హాజరు



ఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఐరోపా పర్యటనలో భాగంగా ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. 33 ఏళ్లలో తొలిసారిగా ఒక భారత ప్రధాని స్లోవేకియాలో అడుగుపెట్టారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం ఆయన స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావా చేరుకున్నారు. స్లోవేకియాకు మిగతా 2 లో

### యూపీలో 'ఇండియా' కూటమిలో

## ఎంఐఎం చిచ్చు.. భిన్నస్వరాలు



ఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా విపక్షాలు వ్యూహరచన చేస్తున్న తరుణంలో, 'ఇండియా' కూటమిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీతో పొత్తు పెట్టుకునే అంశంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), మిగతా 2 లో



దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు..

### కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు

- కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మోదీ శుభాకాంక్షలు
- కష్టపడే నాయకుడని ప్రశంసలు
- బొగ్గు, గనుల రంగంలో సంస్కరణలు చేపట్టారని కితాబు
- అమిత్ షా సహా ఇతర కేంద్ర మంత్రులూ శుభాకాంక్షలు

# మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంది ఆ ముగ్గురే

### కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదు

- మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయి
- మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు
- సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాం



హైదరాబాద్: మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి మిగతా 2 లో



### అధికారులపై సీఎం రేవంత్ ఫైర్..

## అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!

- వర్షాలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
- అవసరమైతే తానూ రోడ్లపైకి వస్తానని వెల్లడి
- నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

2లో

RNI APTEL : 2023/88704


### మోదీ పర్యటనకు 'ధురంధర్' టచ్..
# మేక్రాన్ ఆసక్తికర పోస్ట్

ఢిల్లీ: భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు బాలీవుడ్ టచ్ ఇచ్చారు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఆయన షేర్ చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ చిత్రం 'ధురంధర్'లోని ప్రముఖ 'ఆరీ ఆరీ' పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ప్లే చేస్తూ మోదీ పర్యటనలోని ముఖ్య ఘట్టాలను ఆ వీడియోలో పొందుపరిచారు. సుమారు 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోను 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్‌లో మేక్రాన్ పోస్టు చేశారు. మోదీ, మేక్రాన్ పరస్పరం కరచాలనం చేసుకోవడం, ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం నుంచి వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో మోదీ పాల్గొన్న కార్యక్రమాలు, ఇరు దేశాల మధ్య సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన దృశ్యాలు కనిపిస్తాయి. భారతీయ పాప్ కల్చర్‌ను మేక్రాన్ తన సోషల్ మీడియా పోస్టుల్లో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా భారత్ పర్యటన ముగిసిన తర్వాత 'ధురంధర్'కు సంబంధించిన సంగీతంతో కూడిన వీడియోను ఆయన షేర్ చేశారు. దీంతో భారతీయ నెటిజన్ల నుంచి మంచి స్పందన లభించింది.

### దేశ ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంది..
# కానీ.. మంత్రి నిర్మలా సీతారామన్

ఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని, అయితే ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీర్ఘకాలికంగా వృద్ధిని కొనసాగించాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం చాలా అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఇవాళ జరిగిన 'మైండ్‌మైన్ సమ్మిట్ 2026'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. "మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. ఇంకా ఎక్కడ మెరుగుపరుచుకోవాలో గుర్తించాలి" అని అన్నారు. కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్ వంటి పెద్ద, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని నిలబెట్టుకోవాలంటే సామర్థ్యాలను బలోపేతం చేయడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం కోసం నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. "పురోగతి దానంతట అదే వస్తుందని భావించకూడదు. వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు, సంస్కరణలు తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు. అనేక రంగాలు బలంగా రాణిస్తున్నప్పటికీ, ముఖ్యంగా సంక్లిష్టమైన, మధ్యంతర ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని ఆమె అంగీకరించారు. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు లేదా కొత్త విధానాల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో విధానకర్తలు నిరంతరం పరిశీలించాలని అన్నారు.

ఎల్ నినోపై హెచ్చరిక

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంపై కేంద్ర మంత్రి కీలక హెచ్చరిక చేశారు. దీని కారణంగా రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. "కొన్ని ప్రాంతాలు పొడిగా ఉండొచ్చు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలు కురవొచ్చు. ఇది ఏడాది పొడవునా ఆందోళన కలిగించే అంశం. అయితే, ఈసారి ఎల్ నినో కారణంగా బలహీనమైన రుతుపవనాలకు మేం సిద్ధమవుతున్నాం" అని నిర్మల వివరించారు. కోవిడ్-19 మహమ్మారి అనంతర ప్రభావాలు ఇంకా ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పెద్ద అంతరాయాలు ఏవీ ఊహించడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

### విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలని
# పార్టీ శ్రేణులకు పిలుపు

అమరావతి: దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఢిల్లీలో జనసేన పార్టీ నిర్వహించిన 'సేన ప్రస్థానం-జాతీయ సమైక్యత కోసం' సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న శక్తులను తక్కువ అంచనా వేయకూడదని, అవి బలమైన ప్రభావాన్ని చూపగలవని సుమతీ శతకాన్ని ఉటంకిస్తూ వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలోని లోపాలను నిరసిస్తూ యువత సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన ఉద్యమమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఈ పేరుతో పలుచోట్ల నిరసనలు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "సుమతీ శతకంలో చెప్పినట్లు బలమైన సర్పం కూడా చలిచీమల చేతిలో చిక్కి చనిపోతుంది. ఈ మధ్య కాలంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ పార్టీని చూడగానే నాకు సుమతీ శతకం గుర్తొచ్చింది" అని అన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులు సిద్ధంగా ఉన్నాయని, అటువంటి విభజనవాద ఆలోచనల్లో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే ఢిల్లీలో సమావేశమయ్యామని పవన్ తెలిపారు. కోట్ల మంది కలిస్తే మంచి లేదా చెడు ఏదైనా బలమైన ప్రభావాన్ని చూపించగలరని పేర్కొన్నారు. విభజనవాదాన్ని సృష్టిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మనం అందులో భాగస్వాములం కాకుండా, ఐక్యంగా ఎదురొడ్డి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక

హైదరాబాద్ : హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్-III, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సాలార్‌జంగ్-IIIగా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేస్తున్నారు..
# కిషన్‌రెడ్డిపై మోదీ ప్రశంసలు

ఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశ ప్రగతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడిగా ఆయన్ను అభివర్ణించారు. బొగ్గు, గనుల రంగాల బలోపేతానికి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. కిషన్‌రెడ్డి కష్టపడి పనిచేసే నాయకుడని పేర్కొన్నారు. సంస్కరణలు, విధానపరమైన చర్యల ద్వారా బొగ్గు, గనుల రంగాల్లో మార్పు తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలన్న మోదీ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం కిషన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. బొగ్గు, గనుల రంగాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ పురోగతికి దోహదపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు కూడా కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### ఇరాన్ నిధులపై ట్రంప్ మెలిక..
# రూ.లక్ష కోట్ల నిధులపై వీడని ప్రతిష్టంభన

ఢిల్లీ: పశ్చిమ ఆసియాలో మూడు నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు ఫలించి, ఇరు దేశాలు ఈ ఒప్పందానికి అంగీకరించాయి. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల ప్రతినిధులు ఈ శాంతి పత్రాలపై అధికారికంగా సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందం ఖరారైన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిపై ఉన్న నౌకాదళ ఆంక్షలను తక్షణమే ఎత్తివేస్తున్నట్లు 'ట్రూత్ సోషల్' వేదికగా వెల్లడించారు. "ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది. ప్రపంచ దేశాల నౌకలు.. మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి" అంటూ చమురు సరఫరాను పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం, లెబనాన్‌తో సహా అన్ని సరిహద్దుల్లో తక్షణ కాల్పుల విరమణ అమలులోకి వస్తుంది. అయితే, ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు ఇరాన్‌కు చెందిన నిధుల విడుదల అంశం కీలకంగా మారింది. అమెరికా ఆంక్షల కారణంగా వివిధ దేశాల్లో నిలిచిపోయిన 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్లు) నిధులను చర్చలకు ముందే విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌ను ట్రంప్ తోసిపుచ్చారు. ఒప్పందంలోని నిబంధనలను ఇరాన్ అమలు చేసిన తర్వాతే, పనితీరు ఆధారంగా విడతల వారీగా మానవతా దృక్పథంతో నిధులను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అణు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే మళ్లీ దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ శాంతి ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. స్విట్జర్లాండ్‌లో జరిగే ఈ సమావేశం పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా కీలక ముందడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమరావతిలో సింగపూర్ వర్సిటీ... విద్యారంగంలో ముందడుగు

ఉన్నత స్థాయి ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

#### ఏపీలో ఏఐ, డిజిటల్ విప్లవం... గూగుల్‌తో భాగస్వామ్యం

ముందుగా గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా అభివృద్ధి చేసే అంశంపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవడంలో సహకరించాలని చంద్రబాబు గూగుల్ క్లౌడ్‌ను కోరారు. గతంలో తాను ప్రవేశపెట్టిన రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీఎస్) వ్యవస్థను ఆధునిక క్లౌడ్ టెక్నాలజీలతో మరింత శక్తివంతం చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో గూగుల్ సహకారంతో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో సాధించిన విజయాలను వివరిస్తూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని గూగుల్‌ను ఆహ్వానించారు.

#### అమరావతిలో సింగపూర్ వర్సిటీ...
#### విద్యారంగంలో ముందడుగు

అనంతరం, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం (ఎన్‌యూఎస్) ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్‌తో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిని ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా అమరావతిలో ఎన్‌యూఎస్ అంతర్జాతీయ బ్రాంచ్ లేదా శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు రాజధాని ప్రాంతంలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సాంకేతిక, పరిశోధన సహకారాన్ని అందించాలని ఎన్‌యూఎస్‌ను కోరారు. అలాగే, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించేలా సరికొత్త విధానాల రూపకల్పనలో ఎన్‌యూఎస్‌కు చెందిన పాలసీ ఇనిస్టిట్యూట్ సహకారం తీసుకోవాలని ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా ఎన్‌యూఎస్ ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో తమ భాగస్వామ్యాన్ని పలువురు ప్రొఫెసర్లు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి ప్రతిపాదనపై తమ బోర్డులో చర్చిస్తామని ఎన్‌యూఎస్ ప్రెసిడెంట్ టాన్ ఎంగ్ చేయ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశాలతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోంది

మొదటి పేజి తరువాయి

ఐఆర్‌ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజకీయంగా నష్టం జరుగుతందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాలపై కేంద్రాన్ని అడిగితే.. కింద సమస్యలు ఉన్నాయని తెలిపినట్లు వెల్లడించారు. మెట్‌రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలిన , అంతా మేమే భరిస్తా, కేవలం ఎన్‌ఓసీ ఇవ్వండి కేంద్రం భాగస్వామ్యం లేకుండా నిర్మిస్తామన్నాం. సమస్యలపై చర్చిద్దామంటే కిషన్‌రెడ్డి సమయం ఇవ్వట్లేదని రేవంత్ అన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని తెలిపారు. కేవలం ఆయన నుంచి సహకారం మాత్రమే కోరుకుంటున్నానన్నారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతి, నిధులు ఇచ్చారని, విశాఖ మెట్రో నిర్మాణానికి కూడా అనుమతుల ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, హైదరాబాద్ మెట్రోకు నిధులతో అనుమతులూ లేవని విమర్శించారు. అక్కడే వివక్ష ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు. కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లొంగిపోయారని రేవంత్ ఆరోపించారు. ఆయనకు అంత తెలివిలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి వెళ్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించలేదన్నారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటామంటే వివిధ రకాలలుగా అడ్డు తగులుతున్నారని పేర్కొన్నారు.

### పశ్చిమాసియాలో శాంతికి మార్గం..
# అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హార్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

### అధికారులపై సీఎం రేవంత్ ఫైర్..
# అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!

హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. జూన్ 1న నిర్వహించిన సమీక్షలో ముందస్తు సూచనలు జారీ చేసినప్పటికీ, జూన్ 9న కురిసిన వర్షం సమయంలో అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే సమయంలో జీహెచ్‌ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైనే ఉండి విధులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. "అవసరమైతే నేనూ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వస్తాను. ట్రాఫిక్ సమస్యలు లేదా వరదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని" ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, ఈ సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

### రాష్ట్రంలో యూఎన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
# ఏర్పాటుకు ప్రతిపాదన

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ పట్టణాల సుస్థిర అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో యూఎన్ హాబిటాట్ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని, దీనికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రతిపాదించారు. వాతావరణ మార్పుల నుంచి తీరప్రాంత నగరాలను కాపాడేందుకు ఉద్దేశించిన 'రైజప్' కార్యక్రమాన్ని ఏపీలో అమలు చేయాలని సీఎం సూచించారు. పట్టణాల్లో మురికివాడల అభివృద్ధికి పార్టిసిపేటరీ స్లమ్ అప్‌గ్రేడింగ్ ప్రోగ్రాం (పీఎస్‌యూపీ), వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో అర్బన్ రాస్తా ఫ్రేమ్‌వర్క్‌ను సంయుక్తంగా అమలు చేయడంపై చర్చించారు. 2028 నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా ఒక టైమ్‌లైన్‌తో కూడిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవాలని చంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వాల్యూ క్యాప్చర్ ఫైనాన్సింగ్ వంటి పద్ధతుల ద్వారా స్థానిక ఆదాయ వనరులను పెంచడం, అంతర్జాతీయ వాతావరణ నిధుల సమీకరణ వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనలపై యూఎన్ హాబిటాట్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఏపీతో సంపూర్ణ భాగస్వామ్యానికి వారు సుముఖత వ్యక్తం చేశారు.

## యూపీలో 'ఇండియా' కూటమిలో ఎంఐఎం చిచ్చు.. భిన్నస్వరాలు

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీని ఎదుర్కొనేందుకు ఐక్యంగా సాగాలని భావిస్తున్న ఈ కూటమిలో తాజా పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఎంఐఎంతో పొత్తుపై ఎస్పీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. బీజేపీని ఓడించేందుకు కృషి చేసే ఏ శక్తినైనా తాము స్వాగతిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం దీనికి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒకవైపు మతతత్వాన్ని వ్యతిరేకిస్తూనే, మరోవైపు అదే తరహా రాజకీయాలు చేసే వారితో చేతులు కలపడం సాధ్యంకాదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానమే తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీని అధికారం నుంచి దూరం చేసేందుకు తాము 'ఇండియా' కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే ప్రకటించారు. అయితే, కూటమిలో తమకు సముచిత గౌరవం, సమాన హోదా కల్పించాలని ఆయన షరతు విధించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఆశాజనక ఫలితాలను సాధించింది. అయితే, 2027 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగా బరిలోకి దిగితే బీజేపీ వ్యతిరేక ఓట్లు, ముఖ్యంగా ముస్లిం ఓటు బ్యాంకు చీలిపోయి అంతిమంగా బీజేపీకే లాభం చేకూరుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే క్రమంలో పటిష్ఠమైన ఐక్య కూటమిని నిర్మించడంలో విపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ భిన్నాభిప్రాయాలు నిదర్శనం.

## 33 ఏళ్లలో తొలిసారి.. స్లోవేకియా గడ్డపై భారత ప్రధాని

ఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఐరోపా పర్యటనలో భాగంగా ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. 33 ఏళ్లలో తొలిసారిగా ఒక భారత ప్రధాని స్లోవేకియాలో అడుగుపెట్టారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం ఆయన స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావా చేరుకున్నారు. స్లోవేకియాకు 1993లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. బ్రాటిస్లావా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్లోవేకియా విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ సంప్రదాయబద్ధంగా 'బ్రెడ్ అండ్ సాల్ట్'తో ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన భారత్-స్లోవేకియా సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ 'ఎక్స్' వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు. స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, ప్రధాని రాబర్ట్ ఫికోలతో చర్చల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరపడంతో పాటు, అక్కడి అగ్రశ్రేణి వ్యాపారవేత్తలతో కూడా సమావేశం కానున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , రక్షణ, ఆటోమొబైల్, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య 1.6 బిలియన్ యూరోల వాణిజ్యం ఉంది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈయూ, నాటో సభ్యదేశమైన స్లోవేకియాతో బంధం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# పెట్టుబడులకు భారత్ స్వర్గధామం..

అమరావతి: ఏపీలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నేడు సింగపూర్‌లోని భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో సింగపూర్ కీలక భాగస్వామి కావాలని, ఇక్కడి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని చంద్రబాబు కోరారు. భారతదేశానికి, సింగపూర్‌కు మధ్య ఉన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను ఈ సందర్భంగా హై కమిషనర్ అంబులే ముఖ్యమంత్రికి వివరించారు. ఈ భేటీలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. షిప్ బిల్డింగ్, సివిల్ ఏవియేషన్‌లో ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్హాల్) కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కూడా రాష్ట్రం అనుకూలంగా ఉందని వివరించారు. ఏపీలో 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ప్రపంచ స్థాయి నాణ్యతతో హార్టికల్చర్ ఉత్పత్తులను పండిస్తున్నారని, వీటి ఎగుమతులకు మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగపూర్ టెక్నాలజీ రంగ అవసరాలు తీర్చగల నైపుణ్యం ఏపీ యువతకు ఉందని, రోబోటిక్స్, మెడికల్ డివైసెస్ రంగాల్లో సహకారం అందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని చంద్రబాబు ప్రశంసించారు. పెట్టుబడులతోనే సంపద సృష్టి, ఉద్యోగ కల్పన సాధ్యమని, భారతదేశాన్ని నెంబర్ 1 చేయాలనే లక్ష్యంతో ప్రధాని పనిచేస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు 'హిందూ గ్రోత్ రేట్' అంటూ 1-2 శాతం వృద్ధిని హేళన చేసేవారని, కానీ ఇప్పుడు ప్రధాని మోదీ విధానాలతో పరిస్థితి పూర్తిగా మారిందని అన్నారు. ఆయన చొరవతోనే కియా, ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీకి వచ్చాయని గుర్తుచేశారు. అనంతరం సింగపూర్‌లోని స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, హై కమిషనర్ శిల్పక్ అంబులే కూడా పాల్గొన్నారు. భారత్ ఇప్పుడు నిద్రపోతున్న దేశం కాదని, సంస్కరణలతో దూసుకుపోతున్న అతిపెద్ద ఆర్థిక శక్తి అని చంద్రబాబు స్పష్టం చేశారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానంతో తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని, భూ సమీకరణ ద్వారా అమరావతి వంటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు రాష్ట్రంలోని స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

### ఢిల్లీ మెడలు వంచుతామంటారు..
## ఇక్కడికొచ్చి సైలెంట్ అవుతారు: పవన్ చురకలు

అమరావతి: జనసేన పార్టీ ఢిల్లీ వేదికగా 'జనసేన ప్రస్థానం-జాతీయ సమగ్రత కోసం' అనే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అధికారం కోసం తాను పార్టీ పెట్టలేదని, దేశ సమగ్రతను కాపాడటమే జనసేన ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పన్నెండేళ్లలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని పవన్ గుర్తుచేశారు. కొన్ని పార్టీలు కేవలం తమ మనుగడ కోసం దేశ సమగ్రతను పణంగా పెడుతున్నాయని ఆరోపించారు. దేశ స్ఫూర్తిని ప్రతి తరం ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పాటుపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. తాను తెలంగాణ ఏర్పాటును ఎన్నడూ వ్యతిరేకించలేదని, కాంగ్రెస్ పార్టీ ఏపీని విభజించిన తీరుపైనే ఆనాడు ఆవేదన వ్యక్తం చేశానని వివరించారు. విభజన జరిగిన తీరు రెండు రాష్ట్రాల మధ్య అసంతృప్తిని, అశాంతిని మిగిల్చిందని, ఆస్తుల పంపకాల వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పవన్ వ్యాఖ్యానించారు. "ఢిల్లీకి వచ్చి మెడలు వంచుతామని మాట్లాడే నాయకులు ఇక్కడికి రాగానే మౌనంగా ఉండిపోతారు" అని ఆయన అన్నారు.

## మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంది ఆ ముగ్గురే: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. "రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదు. ఐఆర్‌ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా? కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# వగరూరు చెరువు గండికి మరమ్మత్తులు: అధికారులు, నేతల పరిశీలన




మంత్రాలయం,శివసూర్య,ప్రతినిధి)జూన్ 15: మంత్రాలయం మండలం వగరూరు చెరువుకు భారీ వర్షాలతో గండి పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మార్వో రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, ఎల్ఎల్సీ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి సోదరుడు, మాంచాల కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రామకృష్ణారెడ్డి అధికారులతో కలిసి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలపై అధికారులు, నాయకులు వెంటనే స్పందించి పరిష్కరిస్తారని రామకృష్ణారెడ్డి తెలిపారు.అలాగే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకుడు విశ్వనాథ్ రెడ్డి కూడా అధికారులతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. రైతులకు నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని , అలాగే భవిష్యత్తులో గండి పడకుండా శాశ్వతంగా పరమతులు చేయాలని అధికారులను కోరారు. చెరువుకు మరమ్మతులు పూర్తి చేసి ప్రధాన కట్టకు ముప్పు లేకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

# మంత్రాలయం ప్రధాన రహదారిపై డ్రైనేజీ సమస్య పరిష్కారం



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15: మంత్రాలయంలో ప్రధాన రహదారిపై రెండు రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డంతా మురుగునీరు నిలిచిపోయింది. హోటళ్ల వరుసలో, మఠానికి వెళ్లే దారిలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్వాసనతో నడవలేని పరిస్థితి నెలకొంది.యూజీడీలో బ్లాక్‌ల కారణంగానే డ్రైనేజీ పొంగుతోందని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు, వ్యాపారులు కోరారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి డ్రైనేజీ పొంగిన ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించారు.సోమవారం సాయంత్రానికే తక్షణమే చర్యలు తీసుకుని క్లీనింగ్ పనులు పూర్తి చేయించారు. యూజీడీ బ్లాక్‌లను తొలగించడంతో భక్తులు, స్థానికుల ఇబ్బందులు తీరాయి. సమస్యను సత్వరమే పరిష్కరించిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సోమ అమావాస్యన పునీతమైన రామలింగేశ్వర క్షేత్రం: విశేష అభిషేకాలు



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15:మంత్రాలయం పాత ఊరిలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయం సోమ అమావాస్య పర్వదినం సందర్భంగా సోమవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పుణ్యప్రదమైన ఈ పర్వదినాన ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అర్చక స్వాములు వీరభద్ర స్వామి, సిద్ధలింగయ్య స్వామి ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పవిత్ర తుంగభద్రా జలాలతో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అన్నాభిషేకం కనులపండువగా జరిపించారు. 108 బిల్వ పత్రాలతో అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అర్చనలు చేసి, మహా మంగళ హారతులు సమర్పించారు. వేద మంత్రోచ్చారణలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.సోమవారం నాడు అమావాస్య తిథి రావడం అత్యంత విశిష్టమని, ఈ రోజున శివారాధన చేయడం, పితృదేవతలకు తర్పణాలు వదలడం కోటి పుణ్యఫలాన్ని ప్రసాదిస్తుందని పండితులు తెలిపారు. ఈ పుణ్యదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, అభిషేకాల్లో పాల్గొని తరించారు. భక్తజన సందోహంతో రామలింగేశ్వర క్షేత్రం కిటకిటలాడింది.

# శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి రచ్చమర్రి విద్యార్థి ఎంపిక



MULLA DAWATH

మంత్రాలయం, శివసూర్య(ప్రతినిధి)జూన్ 15:మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్ విద్యార్థి ఎం.దావత్ శ్రీకాకుళం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన దావత్ ఈ ప్రతిష్ఠాత్మక సీటును సాధించాడని పాఠశాల ప్రిన్సిపల్ అశోక్ నాయక్, ఇన్‌ఛార్జ్ ప్రసాద్ సోమవారం తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థి అయిన దావత్ కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించడం గర్వకారణమని ఉపాధ్యాయులు అన్నారు. దావత్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది దావత్‌ను అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దావత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచి స్థానంలో స్థిరపడాలని పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. దావత్ ఎంపికతో రచ్చమర్రి గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

# మంత్రాలయంలో పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15:మంత్రాలయం పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం సిఐ దస్తగిరి బాబు సూచనల మేరకు ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర, మూడు చక్రాల వాహనాలు, కార్లు, గూడ్స్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారు, ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి సరైన పత్రాలు లేని వాహనదారులను గుర్తించి అక్కడికక్కడే జరిమానాలు విధించారు.ముఖ్యంగా గూడ్స్ వాహనాల్లో అత్యంత ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆటోల్లో కూలీలను, ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న వాహనాలను నిలిపివేశారు. వారిని కిందకు దించి రోడ్డు భద్రతపై కౌన్సెలింగ్ ఇచ్చారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అది ప్రాణాలకే ప్రమాదమని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. ఒక్కసారి ప్రమాదం జరిగితే ప్రాణాలు దక్కడం కష్టమని, డబ్బులు ఆదా చేసుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని సూచించారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా ప్రతిరోజూ వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన ధ్యేయమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అనుమతులులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
## కర్నూలు జాయింట్ కలెక్టర్‌కు విద్యార్థి సంఘాలు వినతి




కర్నూలు,శివసూర్య, జూన్ 15:ఎమ్మిగనూరుపట్టణంలోనిర్వహించబడుతున్న మేధా ప్రాక్సస్ పాఠశాల మరియు చెన్నాపురం గ్రామంలో ఉన్న లలిత అలియాస్ ప్రతిభ విద్యా నికేతన్ పాఠశాల సరైన ప్రభుత్వ అనుమతులు, రికగ్నిషన్ మరియు కనీస మౌలిక వసతులు లేకుండానే నిర్వహించబడుతున్నాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ౹ా౼ౕఖీ -- ౼ూఎఖీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా పి ఆర్ ఎస్ వై ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునాథ్ మరియు ఆర్ ఏ వి ఎఫ్ రాష్ట్ర నాయకులు కృష్ణ ,మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణం మరియు పట్టణ పరిధిలో ఉన్నటువంటి ఈ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్యా వ్యవస్థలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి విద్యాసంస్థ తప్పనిసరిగా పాటించాలి. అయితే సంబంధిత పాఠశాలలు సరైన రికగ్నిషన్ లేకుండా, తగిన తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, భద్రతా ప్రమాణాలు మరియు ఇతర మౌలిక వసతులు లేకుండానే కొనసాగుతున్నాయి అన్ని పక్కన పనులు జరుగుతూ ఉన్నా కూడా ఒకపక్క విద్యార్థులు ముగిసిన గదుల్లో కూర్చోబెట్టి తరగతులు బోధించడం ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కే విధంగా వారు వ్యవహరించడం బాధాకరమని విద్యార్థుల భవిష్యత్తును ఇలాంటి అనుమతులు లేని పాఠశాలలు లో చేరడం వలన చేరినటువంటి విద్యార్థుల భవిష్యత్తు కూడా నాశనం కావడానికి అవకాశాలు ఉన్నాయని విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం ఎంతో పటిష్టాత్మకంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటే ఇలాంటి అక్రమ పాఠశాలలు రావడం తగదని వారు హెచ్చరించారు కావున జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకొని ఆ పాఠశాలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు

# ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు ఇవ్వాలి

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

- తప్పకుండా పరిశీలిస్తామని కలెక్టర్ హామీ



కర్నూలు,శివసూర్య,జూన్ 15:ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు ఎన్ వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్ కలెక్టర్ ను కోరారు. జర్నలిస్టుల పిల్లలు 50 శాతం ఫీజు రాయితీ కోరుతూ.. సోమవారం కలెక్టర్ ఏ సిరి ని ఆమె ఛాంబర్ లో కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా మీడియా గుర్తింపు పొందినా.. అందులో పని చేసే జర్నలిస్టుల జీవితాలు మాత్రం అస్తవ్యస్థంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా నిత్యం జర్నలిస్టులు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చేయడం, ప్రజల సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజలకు తెలియజేయడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారన్నారు. అయితే మీడియాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులలో అధిక శాతం మంది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందినవారే అన్నారు. సమాజం పట్ల ఉన్న బాధ్యత, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలనే తపనతో ఎంతోమంది ఈ వృత్తిని ఎంచుకుంటున్నారని, అయితే పత్రికలు, టీవీ ఛానళ్ల యాజమాన్యాలు ఇచ్చే చాలీ చాలని వేతనాలు కుటుంబ పోషణకు కూడా సరిపోని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పిల్లలను కూడా చదివించుకోలేని దుస్థితి ఉందన్నారు. పేద పిల్లలకు ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. చివరకు జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని అడిగినా అనేక అడ్డంకులు పెట్టి తిరస్కరిస్తున్నారని, కొంత మంది కోర్టులను కూడా ఆశ్రయించి కొర్రి వేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అన్నివర్గాల ప్రజల కోసం నిష్పక్షపాతంగా పని చేస్తున్న జర్నలిస్టుల పట్ల వివక్ష తగదన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లల పట్ల ఉదాశీనతతో వ్యవహరిస్తున్నా.. కర్నూలు జిల్లా లో మాత్రం కొంత మంది ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలు, అధికారులు శీతకన్ను ప్రదర్శించడం బాధాకరం అన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఎలాంటి ఇబ్బంది లేకుండా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ సర్క్యులర్ ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల విన్నపాన్ని అధికారులు, యాజమాన్యాలు మన్నించి అండగా నిలవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఏ సిరి అధికారులు, యాజమాన్యాలతో మాట్లాడి 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మంజు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాష్, ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యవర్గ సభ్యులు మధు, నగర నాయకులు మల్లికార్జున, హరి కృష్ణ, రమేష్, వీడియో జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్నేహల్, సూరి, రమేష్ తదితరులు కలెక్టర్ ను కలసిన వారిలో ఉన్నారు.

# జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడిని ఘనంగా సత్కరించిన వికాస తరంగిణి సభ్యులు



అలంపూర్, శివసూర్య, జూన్ 15:జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, వి.హెచ్.పి జిల్లా ఆచార్య సంపర్క్ ప్రముఖు ఆచార్య చక్రవర్తి చార్యులను వికాస తరంగిణి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలోఅనేక సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, ఇటీవల 42వ సారి రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆచార్య చక్రవర్తి చార్యుల సేవలను కొనియాడుతూ ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్చక సంఘం సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు, వి.హెచ్.పి సభ్యులు, ఆర్.ఎస్. ఎస్ సభ్యులు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు."సమాజ సేవతో పాటు ధర్మ పరిరక్షణలో ముందుండే నాయకత్వం ఆదర్శప్రాయం" అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# కర్నూలు పశ్చిమ ప్రాంతానికి సాగు,తాగు నీటిని అందించడం లక్ష్యం

రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత -- మంత్రి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు



కర్నూలు,శివసూర్య,జూన్ 15: కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.సోమవారం కర్నూలు నగరంలోని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి శాశ్వతంగా సాగునీరు, తాగునీరు అందించడం లక్ష్యంగా ప్రజాప్రతినిధులతో సమావేశమై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కర్నూలు పశ్చిమ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యత వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రత్యేక బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అయితే కర్నూలు పశ్చిమ ప్రాంతానికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ఈ ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు, తాగునీరు అందించేందుకు అవసరమైతే అదనపు వ్యయం భరించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పశ్చిమ ప్రాంత ప్రజల వలసలను ప్రత్యక్షంగా గమనించిన మంత్రి నారా లోకేష్, భవిష్యత్తులో వలసలు లేకుండా శాశ్వత నీటి వనరులు కల్పించాలని ఆదేశించారని వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జల్ జీవన్ మిషన్ కింద కూడా పశ్చిమ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతుతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.24 వేల కోట్లు వ్యయం చేయగా, అందులో 51 శాతం అంటే సుమారు రూ.12,450 కోట్లు రాయలసీమ ప్రాంతానికే కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇది రాయలసీమ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 2014--2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు సుమారు రూ.12 వేల కోట్లు వ్యయం చేయగా, 2019--2024 మధ్య గత ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్ల మేర మాత్రమే ఖర్చు చేసిందని పేర్కొన్నారు. రాయలసీమకు జీవనాడిగా నిలిచిన తుంగభద్ర ప్రాజెక్టు నిర్వహణలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయిన క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, నిపుణులు కన్నయ్య నాయుడును పంపించి, నీరు ఉండగానే కొత్త గేటు ఏర్పాటు చేసి, 80 టీఎంసీల నీటిని కాపాడగలిగామని తెలిపారు. అంతేకాకుండా, తుంగభద్ర డ్యామ్‌లో మొత్తం 33 గేట్లను కొత్తగా ఏర్పాటు చేసే పనులు పూర్తి చేశామని, ఈ నెల 25న కేంద్ర మంత్రుల చేతుల మీదుగా వాటిని ప్రజలకు అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.253 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రూ.59 కోట్లతో రక్షణ చర్యలు ప్రారంభించామని తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంటేనే అవుకు, గండికోట, చిత్రావతి బేసిన్ ప్రాంతాలకు నీటి సరఫరా సాధ్యమవుతుందని వివరించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు జీవనాడిగా నిలిచిందని పేర్కొంటూ, గత ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై కనీస అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రూ.3,861 కోట్ల వ్యయంతో 728వ కిలోమీటర్ వరకు కృష్ణా జలాలను తరలించే చర్యలు చేపట్టిందని తెలిపారు. కర్నూలు పశ్చిమ ప్రాంతానికి ప్రత్యేక కార్యాచరణ గాజులదిన్నె ప్రాజెక్టు మిగిలిన పనులను పూర్తి చేసి ఎమ్మిగనూరు, డోన్, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు భూసేకరణ, గేట్ల ఏర్పాటు తదితర పనుల కోసం రూ.20 కోట్ల అవసరాన్ని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిపారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సంబంధించి ఓఅండ్ఎం పనులు, కొత్త మోటార్ల ఏర్పాటు కోసం రూ.11 కోట్ల వ్యయంతో ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తు నిర్వహణ వ్యయాలను కూడా బ్లూప్రింట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు అత్యంత కీలకమైన వేదవతి ప్రాజెక్టును ప్రభుత్వం 36 ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో ఒకటిగా చేర్చిందని తెలిపారు. సుమారు రూ.2,000 కోట్ల అంచనా వ్యయంతో భూసేకరణ సమస్యలను పరిష్కరించి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని నగరడోణ రిజర్వాయర్ మిగిలిన పనులు పూర్తి చేస్తే సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరి చెరువుకు నీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే 68 చెరువుల్లో 67 చెరువులకు హంద్రీ-నీవా ద్వారా నీరు అందించామని, మిగిలిన జొన్నగిరి చెరువుకు కూడా ఈ సీజన్‌లో నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పులికనుమ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఎల్ఎల్సీ నీటి వినియోగ సామర్థ్యాన్ని విస్తరించడం, హెచ్ఎంఎస్-ఎస్ పరిధిలో గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాని ప్రాంతాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), గుండ్రేవుల ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర సమస్యలను తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలతో సంప్రదింపుల ద్వారా పరిష్కరించి ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాయలసీమకు, ముఖ్యంగా కర్నూలు పశ్చిమ ప్రాంతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సాగునీరు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో రాయలసీమ 'రత్నాల సీమ'గా వెలుగొందినట్లే, భవిష్యత్తులో కూడా సాగునీరు, తాగునీటి సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో కర్నూలు పశ్చిమ ప్రాంత అభివృద్ధికి దశలవారీ కార్యాచరణ అమలు చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.అంతకుముందు ఎంపీ,ఎమ్మెల్యేలు, ఇన్చార్జి లతో మంత్రి సమావేశం నిర్వహించి పశ్చిమ ప్రాంత తాగు తాగునీటి అంశాలపై చర్చించారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయ నాగేశ్వర్ రెడ్డి, డా. పార్థసారథి, నియోజకవర్గ ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన సభలో మంత్రాలయం సమస్యలను ప్రస్తావించిన జనసేన ఇన్‌ఛార్జ్ లక్ష్మన్న



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15: కర్నూలులోని కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం "సుపరిపాలన – స్వర్ణాంధ్రప్రదేశ్" పేరిట ఎన్డీఏ కూటమి విస్తృతస్థాయి సభను నిర్వహించింది. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సభలో మంత్రాలయం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్న ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. అదే సమయంలో మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను కూటమి పెద్దలు, మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు.నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని లక్ష్మన్న విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి జనసేన తరపున తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## మంత్రాలయం అభివృద్ధే లక్ష్యం: నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన టీడీపీ ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి




మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15:కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూలు నగరంలోని బైరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అభినందన సభకు హాజరైన నీటిపారుదల శాఖ మంత్రిని నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి రాఘవేంద్ర రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించిన




ఇరిగేషన్ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై మంత్రితో ఆయన ప్రత్యేకంగా చర్చించారు.లికూటమి ప్రభుత్వమే శ్రీరామరక్ష: సభను ఉద్దేశించి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం – అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తోందని అన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడమే కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజాదరణ పొందిన ప్రభుత్వాన్ని చూసి తట్టుకోలేక ప్రతిపక్ష వైసీపీ నేతలు 'రెండేళ్లకు వెన్నుపోటు' అంటూ కార్యక్రమాలు నిర్వహించడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధికి అడ్డుపడే రాజకీయాలను ఎప్పటికీ ఆదరించరని స్పష్టం చేశారు.స్థానిక ఎన్నికలే లక్ష్యం:రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో మరింత బలోపేతంగా పనిచేయాలని రాఘవేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. 2029లో మరోసారి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సభాముఖంగా కోరారు.మంత్రి హామీ:మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్న నీటిపారుదల శాఖ మంత్రి, ఇరిగేషన్ శాఖ సీఈ మరియు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి నియోజకవర్గ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## SIRకార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు చురుగ్గా పాల్గొనాలి: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మంత్రాలయం ,శివసూర్య(ప్రతినిధి)జూన్ 15:ప్రతినిధి:మంత్రాలయం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, బూత్ కమిటీ సభ్యులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు.ూ×= కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటర్ల జాబితా సర్వేలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కూడా చాలా విలువైనదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా ఉన్న ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత బూత్ కమిటీ సభ్యులపై ఉందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితాలో కొత్తగా అర్హులైన వారి పేర్లు చేర్చడం, మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు తొలగించడం వంటి అంశాలపై బూత్ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన జరపాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి, పార్టీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా జాగ్రత్త వహించాలని దిశానిర్దేశం చేశారు. బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోండి: కలెక్టర్‌కు వినతి




కర్నూలు,శివసూర్య, జూన్ 15:జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి స్కూలు ఫీజులు, పుస్తకాల పేరుతో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిపై తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ( ఎం ఎస్ పి ) కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపోగు రవి మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి గారిని కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అన్నెపోగు రవి మాదిగ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల వైఖరిని చూసిచూడనట్లు వదిలేస్తున్నారని, వారి నిర్లక్ష్యం వల్లేయాజమాన్యాలు మరింతగా రెచ్చిపోతున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజులు కట్టలేక పొలం పనులకు.."పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ పాఠశాలలు డిమాండ్ చేస్తున్న భారీ ఫీజులను భరించలేకపోతున్నారు. ఫీజులు కట్టే స్తోమత లేక, దిక్కుతోచని స్థితిలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి, పొలం పనులకు మరియు కూలి పనులకు పంపిస్తున్నారన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

### రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాల పంపిణీ

### ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల,శివసూర్య,జూన్ 15:సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు స్వయం సమృద్ధితో జీవించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డులో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ (ూణ×ూ) పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరితో కలిసి కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వృద్ధులకు చేతికర్రలు తదితర సహాయక పరికరాలను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సుమారు 5 వేల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వివిధ సహాయక పరికరాల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు చేరవేసి వారికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు అంశంపై స్పందిస్తూ, 90 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి పూర్తిగా ఇతరులపై ఆధారపడే వ్యక్తులకు ప్రత్యేక నిబంధనల మేరకు అధిక పెన్షన్ అందజేస్తున్నట్లు వివరించారు. అర్హుల వివరాలను వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.16 కోట్ల నిధులు కేటాయించిందని, మరింత మంది లబ్ధిదారులకు మద్దతు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 24,679 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.15.26 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా డయాలసిస్ మరియు మంచానికే పరిమితమైన పక్షవాతం బాధితులకు ప్రత్యేకంగా రూ.1.53 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు సామాజిక భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగ శక్తి కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలి. జిల్లాలో ఇప్పటివరకు 1.42 లక్షల మంది దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకుని రూ.58.64 లక్షల విలువైన ప్రయాణ సౌకర్యం పొందినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డ్ కార్యాలయాల్లో మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని, సాధారణ వినతిపత్రాలు సమర్పించడం ద్వారా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, సంబంధిత విభాగాలు పరిశీలించిన అనంతరం తుది అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలీంకో సంస్థ కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ కొనియాడారు. గత మూడు వారాలుగా సంస్థకు చెందిన సిబ్బంది జిల్లాలోనే ఉండి లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలీంకో ద్వారా గుర్తించిన 1,847 మంది దివ్యాంగులకు దాదాపు రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్న ఆత్మవిశ్వాసం, పట్టుదల సమాజానికి ఆదర్శమని, వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం గుర్తించి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, స్థలాల కబ్జా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, ఉమ్మడి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాతిమా, ఆర్డీఓ విశ్వనాథ్ మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ రవికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక

### జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన

### ముఖ్యమంత్రి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి





కర్నూలు,శివసూర్య,జూన్ 15 : జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారని ,పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరి లో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీని సందర్శించనున్నారని, ఈ పర్యటనకు కావలసిన ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్లాంట్ పరిశీలన, తదుపరి ప్లాంట్ సమీపంలో బహిరంగసభలో పాల్గొననున్నారని తెలిపారు.. హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుండి పబ్లిక్ మీటింగ్ ముగించుకుని తిరిగి విజయవాడ బయలుదేరేంతవరకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిపాడ్ , బహిరంగ సభ, బారికేడింగ్, రోడ్ల నిర్మాణం ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ శాఖల అధికారులను కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరంతర కరెంటు సరఫరా చర్యలు , త్రాగునీరు , టాయిలెట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల ఎస్ ఈ లను ఆదేశించారు. మూడు ప్రదేశాలలో అంబులెన్స్ లతో ఉండాలని , లైవ్ బ్లడ్ డోనర్ , కార్డియో , న్యూరో స్పెషలిస్టులు , ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.పి జి ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎంప్లాయిమెంట్ అధికారిణి ని ఆదేశించారు. జలధార జలహారతి, డిఆర్డిఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్ , స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర, ఆర్ అండ్ బి తదితర శాఖలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , డిఆర్ఓ వెంకట నారాయణమ్మ , ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డి ఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , డాక్టర్ భాస్కర్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ జఫరుల్లా , డ్వామా పిడి నరసింహరెడ్డి డిఇఓ నాగరాజు , ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి , ఆర్డీవో పత్తికొండ చిన్న ఓబులేసు,డిటిసి శాంతకుమారి, ఐసిడిఎస్ పిడి విజయ , ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి భాస్కర్ నాయుడు , ఏడి హార్టికల్చర్ రాజ కృష్ణ రెడ్డి , ఈడి సోషల్ వెల్ఫేర్ తులసిదేవి , డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , జిల్లా పరిశ్రమల అధికారి అశోక్ కుమార్ , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , సి పి ఓ భారతి , దేవాదాయ శాఖ ఏసి సుధాకర్ రెడ్డి , డిడి మైన్స్ నాగిని , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , డి పి ఓ భాస్కర్ , ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, తగ్గితర అధికారులు పాల్గొన్నారు.జూన్ 24న ముఖ్యమంత్రి

**నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక**

**జొన్నగిరి జీయో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీ**

**పరిశీలన నిమిత్తం పర్యటన**

**ముఖ్యమంత్రి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయండి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

కర్నూలు , జూన్ 15 :- జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారని

పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరి లో జీయో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీ పరిశీలన నిమిత్తం వస్తున్నారని ఈ పర్యటనకు కావలసిన ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 24న పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలోని జియో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీ పరిశీలన చేస్తారని కావున ముఖ్యమంత్రి స్థాయి పర్యటనకు తగిన ఏర్పాట్లు ఎటువంటి పొరపాట్లు లేకుండా చేయాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. జొన్నగిరిలో హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుండి పబ్లిక్ మీటింగ్ ముగించుకుని తిరిగి విజయవాడ బయలుదేరేంతవరకు ముఖ్యమంత్రి కి అవసరమైన అన్ని సౌకర్యాలు కలుగజేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన కొరకు ఆరు స్టాల్స్ ఏర్పాటు చేసి అందులో వివరాలు ఉండేలాగా పొరపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడ్వాన్స్ లైఫ్ సపోర్టింగ్ సిస్టంలు మూడు ప్రదేశాలలో అంబులెన్స్ లతో ఉండాలని , లైవ్ బ్లడ్ డోనర్ , కార్డియో , న్యూరో స్పెషలిస్టులు , ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.పి జి ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎంప్లాయిమెంట్ అధికారిణి ని ఆదేశించారు. ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ అధికారులను రోడ్లు , బారికేడింగ్ , హెలిపాడ్ , బహిరంగ సభ స్థలం పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని , ట్రాన్స్కో అధికారులను నిరంతర కరెంటు సరఫరా చర్యలు , త్రాగునీరు , టాయిలెట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎస్ ఈ ఆర్డబ్ల్యూఎస్ మనోహర్ ను ఆదేశించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , డిఆర్ఓ వెంకట నారాయణమ్మ , ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డి ఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , డాక్టర్ భాస్కర్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ జఫరుల్లా , డ్వామా పిడి నరసింహారెడ్డి డిఇఓ నాగరాజు , ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి , ఆర్డీవో పత్తికొండ చిన్న ఓబులేసు,డిటిసి శాంతకుమారి, ఐసిడిఎస్ పిడి విజయ , ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి భాస్కర్ నాయుడు , ఏడి హార్టికల్చర్ రాజ కృష్ణ రెడ్డి , ఈడి సోషల్ వెల్ఫేర్ తులసిదేవి , డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , జిల్లా పరిశ్రమల అధికారి అశోక్ కుమార్ , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , సి పి ఓ భారతి , దేవాదాయ శాఖ ఏసి సుధాకర్ రెడ్డి , డిడి మైన్స్ నాగిని , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , డి పి ఓ భాస్కర్ , ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు , మొదలగు అధికారులు పాల్గొన్నారు.

# డీ.డీ.ఎన్.ఏస్. వికాసతరంగిణి ఆధ్వర్యంలో చాలీసా విష్ణు సహస్రనామం



జోగులాంబ, శివసూర్య జూన్ 15 గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో సత్సంగ సనాతన కార్యక్రమంలో ప్రసంగించిన ఆచార్య చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య జూన్ 15: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలోని సీతారామాంజనే య స్వామి దేవాలయంలో సత్సంగ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తాహ భాగవత కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ, సత్ప్రవర్తన, గోవు యొక్క విశిష్టత, రామనామ మహిమ గురించి విశదీకరించారు. ధర్మాన్ని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు అర్చక సంఘం సభ్యులు వికాస తరంగి ణి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, ఎర్రవల్లి గ్రామ ప్రజలు, భక్తులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లిలో "మన గుడి" కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గట్టు, శివసూర్య, జూన్ 15: జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామంలో "మన గ్రామం -- మన గుడి" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, జిల్లా ఆచార్య సంపర్క్ ప్రముఖ్ శ్రీ చక్రవర్తి చార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సనాతన ధర్మం, భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ఆలయాల ప్రాముఖ్యత, యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించాల్సిన అవసరంపై ప్రసంగించారు. అలాగే సమాజంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రాధాన్యతను వివరిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మధు, తుమ్మలపల్లి గ్రామ ప్రజలు, అర్చక సంఘం సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు."""లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించిన జిల్లా అర్చక సంఘం వికాస తరంగిణి సభ్యులుఅలంపూర్, శివసూర్య, జూన్ 15: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీలేక కిరాణా, శ్రీ గురు ఓంకార పీఠం సభ్యుల ఆధ్వర్యంలో స్థలదేవత తాయమ్మ గుడి సమీపంలో విశ్వక్సేన సహిత లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వి. హెచ్.పీ జిల్లా ఆచార్య సంపర్గ్ ప్రముఖ్, జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పుణ్యకార్యక్రమంలో ఈడుగోనిపల్లి ఆంజనేయులు, దొడ్డి ఆలయ అర్చకులు మరియు ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించిన జిల్లా అర్చక సంఘం వికాస తరంగిణి సభ్యులు



అలంపూర్, శివసూర్య, జూన్ 15: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీలేక కిరాణా, శ్రీ గురు ఓంకార పీఠం సభ్యుల ఆధ్వర్యంలో స్థలదేవత తాయమ్మ గుడి సమీపంలో విశ్వక్సేన సహిత లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వి. హెచ్.పీ జిల్లా ఆచార్య సంపర్గ్ ప్రముఖ్, జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పుణ్యకార్యక్రమంలో ఈడుగోనిపల్లి ఆంజనేయులు, దొడ్డి ఆలయ అర్చకులు మరియు ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మాజీ మంత్రి జోగు రామన్న ప్రకటన హలో యువత.. చలో సిసిఐ పరిశ్రమ

అదిలాబాద్ జిల్లా :ఆదిలాబాద్ నిరుద్యోగ యువతీ యువకులారా, సీసీఐ పరిశ్రమ ఏర్పాటు దిశగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న "హలో యువత.. చలో సీసీఐ పరిశ్రమ " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను కూల్చివేసే చర్యలకు పాల్పడటం వల్ల యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి సిమెంట్ ఫ్యాక్టరీ వరకు సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న కీలక పరిశ్రమ అంతరించిపోతుందనే పరిస్థితిని ప్రతి ఒక్కరూ

# అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలి

### పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల,శివసూర్య,జూన్ 15 :అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), జలధార - జల హారతి, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల ప్రాంగణాల్లో చేపట్టాల్సిన మొక్కల పెంపకం కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు మరింత చొరవ చూపి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కేవలం కొంతమంది అధికారుల బాధ్యతగా కాకుండా, అన్ని శాఖలు సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. స్థలం లేకపోవడం, రాతినేలు, ప్రహరీ గోడల సమస్యలు వంటి కారణాలతో పనులను వాయిదా వేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, అవసరమైన అంచనాలు సిద్ధం చేసి పిట్టింగ్, మొక్కల నాటే కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల వారీగా పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తామని, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి ఉన్నందున జిల్లాలో ఆదర్శప్రాయంగా అమలు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న 1,629 మంది బీఎల్ఓలకు ఎలాంటి ఇతర విధులు అప్పగించకుండా చూడాలని ఆదేశించారు. బీఎల్ఓలుగా పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఎన్నికల విధులకు పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. జిల్లాలోని సుమారు 14 లక్షల మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను ఫోటోగ్రాఫ్‌లతో సహా డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయని, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అప్పటి వరకు ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి బదిలీలు ఉండవని పేర్కొన్నారు. ఉల్లాస్ 100 రోజుల కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మ్యాపింగ్ పూర్తి కాని ప్రాంతాల్లో ఏపీఓలు, ఏపీఎంలు, ఇతర సిబ్బంది సహకారంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు జలధార - జలహారతి కార్యక్రమం కింద జిల్లాలో మొత్తం 2,103 పనులు మంజూరవగా, 1,044 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1,059 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బనగానపల్లి, పాణ్యం, ప్యాపిలి, డోన్, రుద్రవరం మండలాల్లో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో చేపట్టిన ఉత్తమ జల సంరక్షణ కార్యక్రమాన్ని కేస్ స్టడీ లేదా సక్సెస్ స్టోరీ రూపంలో సిద్ధం చేసి అందించాలని వాటర్ రిసోర్స్ ఇంజనీర్లకు సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లాలో అమలవుతున్న జలధార కార్యక్రమాన్ని అభినందించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గత నవంబర్‌లో 3.5 మీటర్లుగా ఉన్న నీటిమట్టాన్ని ఈ ఏడాది నవంబర్ నాటికి కనీసం ఒక మీటరు మేర మెరుగుపరిచే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై విస్తృత అవగాహన కల్పించాలి.

----- ప్రజలందరిలో ఎస్ ఐ ఆర్ పై ఉన్న అపోహలు తొలగించాలి:

-- జూన్ 23న జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహణ..

---- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ...

.ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్ ఐ ఆర్ పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం చేపట్టనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత కీలకమైందని తెలిపారు. ముఖ్యంగా డబుల్ ఓట్లను గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలందరూ ఇటువంటి అపోహలు లేకుండా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ఎన్యుమరేషన్ ఫారాలను తప్పని సరిగా పూరించే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేసేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి అర్హుడైన ఓటరు ఈ ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లా కేంద్రంలో ఈ నెల 23 న 2కే రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వనపర్తి బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమయ్యే ఈ 2కే రన్ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ముడుమాల్ లోనూతన విద్యా సంవత్సరం ఘనంగా ప్రారంభం

నారాయణపేట జూన్ 15:మాగనూర్ మండలం ముడుమాల్ పాఠశాలలో సోమవారం 2026 - 2027 నూతన విద్యా సంవత్సరం ను ప్రధానోపాధ్యాయులు నిజముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు . నూతన విద్యా సంవత్సర మును పురస్కరించుకొని పాఠశాలకు హాజరైన విద్యా ర్థినీ విద్యార్థులపై పుష్పాలు చల్లుతూ గులాబీ పూలను చేతికి అందిస్తూ ఘనంగా విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం స్వాగతం తెలిపారు. విద్యార్థులు కృతజ్ఞతా భావం తో ఉపాధ్యాయ బృందం కు ధన్యవాదాలు తెలుపుతూ పాదాభివందనం చేస్తూ పాఠ శాలలోకి ప్రవేశించారు. అంతకుముందు ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రతి తరగతి గదిని నిశితంగా పరిశీలిస్తూ ఎలాం టి క్రిమి కీటకాలు లేవని నిర్ధారించిన తర్వాత విద్యా ర్థులను తరగతి గదిలోకి పంపించారు. ఈ సందర్భం గా పాఠశాల ప్రధానోపాధ్యా యులు మాట్లాడుతూ విద్యా ర్థులు ప్రతినిత్యం క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ప్రతి రోజు ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను నేర్చుకొని ఉన్నత స్థాయికి రావాలని సూచించా రు. అదేవిధంగా ప్రభుత్వము అందజేస్తున్న పుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ సూచనల మేరకు పరిశుభ్రమైన మధ్యా హ్న భోజనమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృం దం కురుమయ్య, జనార్దన్ రెడ్డి,శ్రీనివాస్, మాధవి, రమే ష్ తిమ్మప్ప, హేమా,మీనా కుమారి పాల్గొన్నారు.

## నాగయ్య గుంపు -- కోటిలింగాల గ్రావెల్ రోడ్డు నిర్మాణం : రైతులకు వరం

ఖమ్మం జిల్లా, కారేపల్లి , జూన్ 15 : పొలంపల్లి , భాగ్యనగర్ గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు చాలా కాలంగా రవాణా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నాగయ్య గుంపు నుండి కోటిలింగాల వరకు ఉన్న మట్టి రహదారి బురదమయంగా మారి రైతులు తమ పంటలను తరలించుకోవడం , వ్యవసాయ పనుల కోసం రాకపోకలు సాగించడం ఎంతో కష్టసాధ్యమయ్యేది. ఈ సమస్యను గుర్తించిన స్థానిక రైతులు వైరా నియోజకవర్గ శాసన సభ్యులు రాందాస్ నాయక్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. రైతుల సమస్యలను సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో, వినతిపత్రం అందించిన వారం రోజుల వ్యవధిలోనే పొలం పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ , ఖమ్మం జిల్లా దిశ కమిటీ సభ్యులు దారావత్ హేమలత బాలాజీ ప్రత్యేక చొరవ తీసుకొని పాలకవర్గ సభ్యుల సహకారంతో నాగయ్య గుంపు నుండి కోటిలింగాల వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణంతో రైతులకు ఎంతో ఉపశమనం లభించింది. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం, ఎరువులు, విత్తనాలు మరియు ఇతర వ్యవసాయ సామగ్రిని పొలాలకు చేర్చడం సులభతరమైంది. అదేవిధంగా గ్రామ ప్రజల రాకపోకలు కూడా సౌకర్యవంతంగా మారాయి. గతంలో వర్షాకాలంలో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉన్న ఈ మార్గం ఇప్పుడు సురక్షితమైన రవాణా సదుపాయంగా మారింది. గ్రామ పంచాయతీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండటమే కాకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కొత్త దిశను చూపుతున్నాయి. ఇప్పటివరకు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన పొలం పల్లి గ్రామ పంచాయతీ, గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే పూర్తయిన మరియు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులే గ్రామ పంచాయతీ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ గ్రావెల్ రోడ్డు నిర్మాణం రైతుల కలలను సాకారం చేయడమే కాకుండా గ్రామీణాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. గ్రామ ప్రజలు, రైతులు సర్పంచ్ హేమలత బాలాజీ , పాలకవర్గ సభ్యులకు మరియు ఎమ్మెల్యే శ్రీ రాందాస్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు.

## పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ : తుంబూరు దయాకర్ రెడ్డి

ఖమ్మంమంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో 46 మందికి అందజేత "అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా, వంద శాతం పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.16,64,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయి కూడా పక్కదారి పట్టకుండా, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తూ నేరుగా లబ్ధిదారుల చేతులకే ఈ ఆర్థిక సాయం అందేలా చూస్తున్నామని వివరించారు. కార్పొరేట్ వైద్య భారాన్ని మోయలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఈ సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చింతలపాడు పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ

మొట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య , టీపీసీసీ వైరా సోషల్ మీడియా కో -ఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్

మండలంలోని మొట్లగూడెం గ్రామపంచాయతీ చింతలపాడు లోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నాడు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పొడుగు పెంటయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొడుగు పెంటయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు, ఉపాధ్యాయుల కృషి:విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు...నూతన విద్యా సంవత్సరానికి గాను పుస్తకాలు అందడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు, ఉపసర్పంచ్ తాటి రామారావు , వార్డ్ సభ్యులు సాగబోయిన యశోద టీపీసీసీ వైరా అసెంబ్లీ సోషల్ మీడియా కో -ఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

' ఖమ్మంప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ఖమ్మం,ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్ 188, 190, 119 లో ఎస్సీ ఎస్టీ వారు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కల గడ్డకు చెందిన టి.ఉమా రాణి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కె.రమేష్ బాబు తనకు సర్వే నెంబర్ 24/హెచ్/6 లో 2 ఎకరాల 31 గుంటల భూమి ఉందని సీతారాం బంజర మేజర్ కాలువ నుండి మా పొలంకి పంట కాలువ ఉందని, పై భాగంలో ఉన్న రైతులు కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సాగునీరు రావడం లేదని, తమకు కాలువ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం మోతీనగర్ కు చెందిన కే.వెంకట కృష్ణ తమ ఇంటికి మిషన్ భగీరథ పైప్ లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన ఏ. రామారావు తన ఇంటి స్థలంలో 2 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ఇంటినిర్మాణానికి ఆటంకం కల్గుతున్నందున ఆ స్తంభాలు తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ టిజి ఎన్పిడిసిఎల్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

## : వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి..

## --- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్..

జూన్ 15: (అంబటి స్వామి ప్రతినిధి). వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ఎఫ్.ఏ.క్యూ నిబంధనలకు అనుగుణంగా, వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం పానగల్ మండలంలోని జమ్మాపూర్, శాఖాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం సేకరణ, తూకాలు, లోడింగ్, తరలింపు ప్రక్రియలను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

SHIVA SURYA TELUGU DAILY RNI APTEL : 2023/88704
శివసూర్య తెలుగు దిన పత్రిక



## గుప్తనిధుల వేట: ఆలయంలో దుండగుల తవ్వకాలు..





జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 15 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలం ర్యాలంపాడు గ్రామానికి పోయే తుంగభద్ర బ్రిడ్జి ప్రక్కన ఒక ప్రాచీన శివాలయం గుప్త నిధుల దుండగుల కారణంగా విధ్వంసానికి గురైంది. తుంగభద్రా నది బ్రిడ్జి ప్రక్కన ఉన్న ఈ శివాలయంలో గుప్తనిధుల కొరకు రాత్రిపూట దుండగులు తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి జరిగిన ఈ దుశ్చర్య వెలుగులోకి వచ్చింది. గర్భగుడిలో మరియు ఆలయ ఆవరణలో తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తుంది. గర్భగుడిలోని విగ్రహాలను ధ్వంసం చేసి వెలుపల వేసిన దుండగులు, లోపల గొయ్యి తవ్వారు. ఇక్కడి పాడుబడిన పురాతన శివాలయంలో గుప్తనిధులు కొరకు వేటగాళ్లు ఆశతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. స్థానికుల ఆవేదన"గ్రామానికి అలనాటి వైభవాన్ని చాటి చెప్పే గుడిని దుండగులు తవ్విపోస్తున్నారు" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..పురావస్తు శాఖ అధికారులు స్పందించి, పురాతన ఆలయాలను కాపాడాలని స్థానికులను కోరుతున్నారు. గుప్తనిధుల వేటకు పాల్పడే వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులుకోరుతున్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల



ఖమ్మం.....ప్రజా భవన్ లో భట్టి విక్రమార్క ను కలిసి శాలువా కప్పి పూలబోకెతో శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు తుమ్మల మరియు ఉత్తమ్ కుమార్ రెడ్డి ....ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన మంత్రి తుమ్మల

## సత్తుపల్లి నియోజకవర్గం పట్టణం, ఎన్టీఆర్ కాలనీ, బడి బాట కార్యక్రమం లో



' సత్తుపల్లి సత్తుపల్లి పట్టణం, ఎన్టీఆర్ నగర్,గ్రామీణ స్కూల్ లో బడి బాట కార్యక్రమం ను ప్రారంభించి, విద్యార్థిని, విద్యార్థుల కు పుస్తకాలు పంపిణి చేసిన..... సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి విద్యా, వైద్యం, వ్యవసాయం కు మొదటి ప్రాధాన్యత ఇస్తూన్నారు .. మీరూ రాగమయి దయానంద్ మేము సత్తుపల్లి నియోజకవర్గం లో గెలిచిన నాటి నుండి పాఠశాల లు, కాలేజీ లు, హాస్టల్స్ లు పరిశీలిస్తు ఉపాధ్యాయులు, విద్యార్థుల కు సమయం కేటాయిస్తూ ప్రభుత్వ సహాయం కాకుండా మా ఆషా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.... మీరూ రాగమయి దయానంద్ పాఠశాల లు తెరిచిన రోజు నుండే విద్యార్థుల కు బుక్స్, పుస్తకాలు, యూనిఫామ్ లు అందిస్తున్న ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి .. మీరూ చదువు అన్నా చదువు కునే వారు అన్న మాకు ఎంతో ఇష్టం.... ఈరోజు మనం చదువుకున్న చదువు రేపటి మన కుటుంబం ను, సమాజం ను కాపాడుతుంది... చదువే రేపటి మన ఆస్థి, గౌరవం, జీవితం ..మీరూ రాగమయి దయానంద్ .విద్యార్థిని, విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం అన్ని విధాలా కష్ట పడుతున్న ప్రిన్సిపాల్స్ కు, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసిన .... మీరూ రాగమయి దయానంద్ డాక్టర్ మట్టా దయానంద్ అల్పాహారం, పాలు కూడా అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కు ధన్యవాదములు తెలియజేసిన ....మీరూ రాగమయి దయానంద్ డాక్టర్ మట్టా దయానంద్ . చిన్నారులను అందరిని ప్రభుత్వ పాఠశాల లో చేర్పించండి అని పిలుపునిచ్చిన... మీరూ రాగమయి గారు, డాక్టర్ మట్టా దయానంద్ ఈ కార్యక్రమం లో వీజూరా రాజేశ్వర్ రావు, ప్రిన్సిపల్ రామ్మోహన్, మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి-రావీజ చైర్మన్ దోమ ఆనంద్, బజూం స్కూల్ ప్రిన్సిపల్ శైలజ, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్, ఎన్టీఆర్ నగర్ స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు,కౌన్సిలర్స్ శరత్ చంద్ర, జగ్గానాధం శ్రీను, నాసిమ షరీఫ్, విద్యార్థినీ విద్యార్థులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ నగర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు....

## సత్తుపల్లి నియోజకవర్గం పట్టణం, ద్వారకాపూరి కాలనీ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ..



సత్తుపల్లి సత్తుపల్లి పట్టణం, క్యాంప్ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రివర్యులు శ్రీ మల్లు బట్టి విక్రమార్క గారి పుట్టినరోజు సందర్భంగా .. సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి గారు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో వారి పుట్టినరోజు వేడుక కార్యక్రమం, కేక్ కటింగ్ కాంగ్రెస్ శ్రేణులు తో ఘనంగా జరిగింది... ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి -రావీజ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కౌన్సిలర్స్,సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు,సత్తుపల్లి పట్టణ, మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, అంబజ నాయకులు పాల్గొన్నారు....

## ఘనంగా 17 వ జాతీయ స్థాయి నాటిక పోటీలు

**కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు ఈగ మల్లేశం....వెల్లడి.**




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్: హన్మకొండ కాళోజీ కళా క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక కార్యక్రమానికి డా. కాజీపేట తిరుమలయ్య అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టి.వి, నాటకరంగ అభివృద్ధి సంస్థ పరపతి సంఘం సభ్యుల సౌజన్యంతో 17 వ జాతీయ స్థాయి నాటిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు ఈగ మల్లేశం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లేశం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగు నాటకరంగం (రంగస్థలం) ఒకటిన్నర శతాబ్దాల కంటే ఎక్కువ ఘనమైన చరిత్రను, విశిష్టమైన సాంస్కృతిక వైభవాన్ని కలిగి ఉంది అన్నారు. సమాజంలోని అజ్ఞానాన్ని, అన్యాయాలను ఎదిరించడానికి, ప్రజల్లో చైతన్యం తేవడానికి తెలుగు నాటకాలు ఎంతో దోహద పడతాయని వారు ఈ సందర్భంగా తెలిపారు.నేడు సినిమా, టెలివిజన్, డిజిటల్ మీడియాల హడావుడిలో నాటకరంగం కొంత ఆదరణ కోల్పోయినప్పటికీ, నంది నాటకోత్సవాలు, వివిధ పరిషత్ నాటక పోటీల ద్వారా ప్రభుత్వాలు, నాటక ప్రేమికులు దీనిని బ్రతికించుకోవడానికి కృషి చేస్తున్నారని వారు కొనియాడారు.నాటక రంగం అనేది తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించే పురాతన కళ. గ్రామీణ ప్రాంతాలలో, ఉత్సవాల సమయాల్లో ఈ నాటకాలు వినోదంతో పాటు సందేశాన్ని ఇస్తాయని వారు పేర్కొన్నారు.నేటి సమాజంలో యువతి యువకులు గ్రాఫిక్స్ మాయలో పడి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఇలాంటి రంగస్థల నాటకాల ద్వారా ప్రజల్ని సామాజికంగా ఉత్తేజ పరచడం ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం ని మెమోంటో తో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన కళాకారులకు బహుమతులు, నగదు ప్రోత్సాహం అందజేశారు. నృత్య కళాకారులకు సర్టిఫికెట్ లు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో గట్టు మహేష్ బాబు, నాగపూరి సంజయ్, శ్రీధర్, సదానందం, వెంపటి శ్రావణి, న్యాయ నిర్ణేతలు ప్రసాద్ రెడ్డి, చారి, షఫీ కళాకారులు, కళాభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పసి పిల్లల ప్రాణాలతో పసి బిడ్డల బడులతో

**చెలగాటం ఆడుతున్న రేవంత్ సర్కార్**

**రాంమూర్తి పోలపల్లి బియర్ఎస్ రాష్ట్ర నాయకులు...వెల్లడి**



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి,జూన్ :గత ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్యలో భాగంగా 2014 లో 298 ఉన్న గురుకులాలను 1022 కు పెంచి, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు 146 ఉంటే వాటిని 737 కు పెంచి అదే విధంగా తెలంగాణ నేల మీద ఒక్క రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల నిర్మించని గత ఉమ్మడి రాష్ట్రం. కెసిఆర్ 85 కళాశాలలు నిర్మించిన ఘనత కెసిఆర్ ది అదే విధంగా 2014 లో 29,268 ప్రభుత్వ పాఠశాలతో కెసిఆర్ చేతికి వస్తే 30,022 పాఠశాలకు పెంచి ప్రభుత్వం విద్య వ్యవస్థను పటిష్టం చేసి ప్రతి విద్యార్థికి సన్న బియ్యంతో అన్నం పెట్టి మంచి ఫుడ్ మెనూ పెట్టిన మంచి మనస్సు కెసిఆర్ ది అన్నారు.గత ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ టీడీపీ ప్రభుత్వాలు పురుగులు పట్టిన దొడ్డు బియ్యం, నీళ్ల చారు, ఇగ ఇందులో పప్పు ఎక్కడ ఉందో వడపోసిన దొరికే పరిస్థితి లేకుంటే ఇగ చారు పళ్లెంలో పోస్తే తూర్పుకు పోతే పడమరకు, ఉత్తరం దిక్కు పోస్తే దక్షణం కొట్టుకు పోయే పరిస్థితి. ఇగ తిందాం అని బుక్క పట్టుకొని నోటి వరకు పోతే ముక్క వాసన ఇలాంటి దుర్భర జీవితాలు గడిపిన పరిస్థితులు చూసిన కెసిఆర్ అధికారంలోకి రాగానే తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో తెలంగాణ గురుకులాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు)లో అమలైన ఆహార మెనూ ఒక్క సారి చూడండి.ఉదయంపాలు ం బూస్ట్ఇడ్లీ, పూరీ, పొంగల్, ఖిచిడీ, పులిహోర, బొండా, చపాతీ వంటి బ్రేక్‌ఫాస్ట్ ఐటమ్స్ మారుస్తూ ఇచ్చేవారు. మధ్యాహ్న భోజనం సన్న బియ్యం పప్పు / సాంబార్,కూర, కొండి గుడ్డు కొన్ని రోజులు నెయ్యి, పెరుగు, మజ్జిగ. రాత్రి భోజనంఅన్నం పప్పు లేదా కూరపెరుగు గుడ్డు కూర లేదా ఇతర ప్రోటీన్ ఆహారం. వారానికి / నెలకువారానికి 4 గుడ్లునెలకు 4 సార్లు చికెన్నెలకు 2 సార్లు మటన్సీజనల్ పండ్లు కొన్ని గురుకులాల్లో డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, ప్రత్యేక పోషకాహారం కూడా ఇచ్చేవారు. ఇలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలను కాపాడుకుంటూ వస్తే ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచినా వ్యవస్థ సర్వ నాశనం చెయ్యడమే కాకుండా పిల్లలకు విషాహారం పెట్టి ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం హయాంలోలెక్కలను మించి తెలంగాణ గురుకులాల్లో 100 మందికి పైగా పిల్లల ఆత్మహత్యలు, అనుమానస్పద మరణాలు, ఫుడ్ పాయిజన్, అనారోగ్య సమస్యలతో మరణించగా, ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలే అన్నారు. అంతే కాకుండా వేల మంది పిల్లలు ఫుడ్ పెయిజన్ కారణంగా ఆసుపత్రి పాలై అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.కానీ ఇప్పుడు సదువురాని ముఖ్యమంత్రి పైగా తానే విద్యాశాఖ మంత్రిగా ఆకునూరి మురళి సూచనలతో ఆకునూరి మురళి గన్నేరు ఆకులు నూరి రేవంత్ రెడ్డికి ఇస్తే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల,ఉపాధ్యాయుల నోట్లో చెవ్వుల్లో ముక్కుల్లో ఆ పసురుపోసి చంపేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎందుకు సాక్షామే ఇప్పుడు 30,022 ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 23,000 ప్రభుత్వం పాఠశాలను మూసేవేసే నిర్ణయం తీసుకున్న రేవంత్ తుగ్లక్ ప్రభుత్వం పేద విద్యార్థుల, పేద ప్రజల ఉసురు తాకి పోతుంది.ఏమైనా అంటే ఇగ మేము యుంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతున్నాం అని 11,600 కోట్లు కేటాయించం అని చెప్పుకుంటూ శంకుస్థాపనల వరకే ఉన్న వీటిని చూపిస్తూ అది అయ్యే ఎంతో కానిది ఎంతో ఒక వేల ఐన రెండు ముందు సంవత్సరాలు పడుతుంది అంతే కాకుండా ఈ స్కూలు విషయంలో కూడా అవినీతి చేసుకుంటూ 5% అధిక రేటు పెంచి టెండర్ చేస్తూ ప్రభుత్వం సొమ్మును లూటి చేస్తున్నారు. 80 కోట్లతో పూర్తి అయ్యే ప్రతి స్కూల్ 200 కోట్లకు పెంచి దంచుకుంటున్నారు ఈ నీతి లేని ప్రభుత్వం, ఇన్ని దుర్మార్గాలు కండ్ల ముందు చేస్తున్న ఈ రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా మూల్యం చెల్లించక తప్పదు అన్నారు.పసి పిల్లల ప్రాణాలతో పసి బిడ్డల బడులతో చెలగాటం ఆడుతున్న ఈ రేవంత్ హిట్లర్ పాలనకు రానున్న రోజుల్లో కర్రు కాల్చి చేతి గుర్తులకు ప్రజలే వాతాలు పెడుతరని అన్నారు.ఫోన్ నెంబర్ : 9307749999

# గద్వాలలో భారీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు: ఇద్దరు నిందితుల అరెస్ట్,

నగదుతో పాటు

60 తులలా వెండి,


9 తులాల బంగారం స్వాధీనం



జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 15 : గద్వాల పట్టణంలో ఇటీవల జరిగిన ఒక భారీ దొంగతనం కేసును స్థానిక పోలీసులు అత్యంత ప్రతిభావంతంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ. 7,000 నగదుతో పాటు 60 తులాల వెండి, 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**జోరుగా తిరుగుతూ రెక్కీ.. ఆపై దొంగతనం:**

పోలీసుల వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన మహబూబ్ వెల్డింగ్ పని చేస్తుండగా, మరొకరు మేస్త్రీగా పని చేసేవారు. వీరిద్దరికీ




వచ్చే సంపాదన సరిపోకపోవడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు తెరలేపారు. ఈ క్రమంలో గద్వాల పట్టణంలోని భీమ్ నగర్ పరిసరాల్లో బైక్‌పై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించారు. పథకం ప్రకారం జూన్ 10, 2026 ఉదయం సమయంలో ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును దొంగిలించారు. ఆ వస్తువులను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తుండగా పోలీసులకు చిక్కారు.

**నిందితుడి వివరాలు:**

1: మహబూబు (వయస్సు 19 సంవత్సరాలు), వృత్తి: వెల్డింగ్ పని, నివాసం: చెనుగోనిపల్లి గ్రామం, గద్వాల మండలం.స్వాధీనం చేసుకున్న సొత్తు:9 తులాల బంగారం (పొడవైన గొలుసు, మంగళసూత్రం, జంట జుంకాలు, చెవి రింగులు, సైడ్ ఇయర్ రింగ్స్, చిన్న పిల్లల ఉంగరం, పెద్ద ఉంగరం, ముక్కు పుల్ల).60 తులాల వెండి.రూ. 7,000 నగదు.దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ (బైక్).

**పోలీసుల చాకచక్యం -- ఎస్పీ అభినందనలు:**


జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీ కె. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ మరియు గద్వాల డీఎస్పీ గారి పర్యవేక్షణలో గద్వాల సిఐ శ్రీ శ్రీను, కళ్యాణ్ ఎస్సై ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల దృశ్యాలు, సాంకేతిక నైపుణ్యం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 15, 2026 (ఈరోజు) ఉదయం గద్వాల పట్టణ శివారులోని చెనుగోనిపల్లి వెళ్లే రహదారి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం ఉదంతం వెలుగుచూసింది.కేసును కేవలం 5 రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన గద్వాల సిఐ శ్రీను, కళ్యాణ్ ఎస్సై, మరియు పోలీస్ సిబ్బంది (ఇంద్రయ్య, కిరణ్, రామకృష్ణ) లను జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రజా ప్రభుత్వం...

క్యాంపు కార్యాలయంలో 106 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్15:ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 106 మంది లబ్ధిదారులకు రూ.1,06,12,296 విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు



ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.పశ్చిమ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నెల రెండు పర్యాయాలు సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని లేదా తమ డివిజన్లలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి మధ్యవర్తులు, దళారులను నమ్మవద్దని, ప్రతి పథకం పూర్తిగా ఉచితంగానే అమలు అవుతోందని స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఈ నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం అవసరమని తెలిపారు. ప్రజలు ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు.పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరే వరకు ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు హనుమకొండ ఎమ్మార్వో, కాజీపేట ఎమ్మార్వో ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు



విజయవాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా ఎపి లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కూడా వాతావరణం మారే సూచనలు కనిపిస్తున్నాయి. అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఉండటం మంచిది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక సూచనలు చేశారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉరుములతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద నిలబడటం ప్రమాదకరం అని అన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, బయట తిరిగే వారు తక్షణమే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని కోరారు. అనవసరమైన పనుల కోసం బయటకు వెళ్లడం తగ్గించుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. ఎపి లోని కీలక జిల్లాలపై ఈ వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా ఉంటుందని తెలియజేశారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, గోదావరి జిల్లాల ప్రజలు వాతావరణ పరిస్థితులపై దృష్టి పెట్టాలి. ఎన్టీఆర్, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్న వారు కూడా వాతావరణ హెచ్చరికలను గమనించాలి. వాతావరణ శాఖ ఇచ్చే తాజా సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. వర్షాల సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండటం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు.

## నెతన్యాహు చాలా కఠినమైన వ్యక్తి : ట్రంప్



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో దాదాపు మూడు నెలలుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణలకు ముగింపు పలకడానికి ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. అయితే ఈ ఒప్పందానికి అత్యంత సన్నిహితుడైన ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అభ్యంతరం తెలిపారన్నారు. ఈ సందర్భంగా అతన్ని(నెతన్యాహు) చాలా కఠినమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. కాగా, ట్రంప్ న్యూయార్క్ టైమ్స్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఎట్టకేలకు ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కుదర్చుకోవడానికి అమెరికా చేసిన ప్రయత్నానికి, మిత్ర దేశం ఇజ్రాయిల్ తన మద్దతు ప్రకటించాలి. కృతజ్ఞతలు తెలపాలి' అని ఆయన అన్నారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిందని ప్రకటించే ముందు తాను ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాతో 28 నిమిషాలపాటు ఫోన్‌లో సంభాషించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. తాను నెతనాహ్యుతో జరిపిన సంభాషణలో లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్ని గురించి ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు. 'ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదర్చినందుకు నెతన్యాహు మాకు చాలా కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే ఒకవేళ ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండి ఉంటే, ఇజ్రాయెల్ రెండు గంటల పాటు కూడా మనుగడలో ఉండేది కాదు' అని ట్రంప్ న్యూయార్క్ టైమ్స్‌తో అన్నారు. ఆదివారం నాడు ఇరాన్‌తో ఒప్పందాన్ని అమెరికా ప్రకటించడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయిల్ బీరూట్‌పై దాడి చేసింది. దీనిపై ట్రంప్ స్పందించారు. నెతన్యాహుకు అసలు విచక్షణే లేదని ట్రంప్ విమర్శించారు. "బిబి ఆ దారుణమైన దాడి ఎందుకు చేయాల్సి వచ్చింది? నాకు చాలా కోపం వచ్చింది. ఆ విషయాన్ని నేను అతని (నెతన్యాహు)కి చెప్పాను. అతనికి ఏమాత్రం విచక్షణ లేదు. దీనివల్ల పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ఒప్పందంపై సంతకం చేయడం కొన్ని గంటల పాటు వాయిదా పడింది అని ట్రంప్ 'ఆక్సియోస్' మీడియాతో అన్నారు. ఆ తర్వాత మళ్లీ సవరించుకుని.. నెతన్యాహుపై నేను చూపింది కోపం అని చెప్పను. కానీ అతను నిరంతరం లెబనాన్‌తో గొడవ పడడం నన్ను కొంచెం కలవరపెట్టింది అని న్యూయార్క్ పోస్ట్ పాడ్ ఫోర్స్ వన్‌తో ట్రంప్ అన్నారు.

## 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం : బ్రిటన్ ప్రధాని



లండన్ : పదహారేళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం వెల్లడించారు. సోషల్ మీడియా వ్యసనం వల్ల చిన్నారుల జీవితాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా వారి మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందో గమనించిన తర్వాత వేలాది మంది తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. కాగా 'ఈ రోజుల్లో, సాంకేతికత తమ జీవితంలోని ప్రతి రంగంలోనూ చొరబడుతున్న, అత్యంత వేగంగా మారుతున్న ప్రపంచంలో పిల్లలు తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకోవాల్సి ఉంది. అది వారికి హాని చేస్తుందని మాకు తెలుసు. సంప్రదింపుల ప్రక్రియలో తల్లిదండ్రుల నుంచి వచ్చిన స్పందన అత్యంత స్పష్టంగా ఉంది. వేలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలు సోషల్ మీడియాకు బానిసలయ్యారని చెబుతున్నారు. సోషల్ మీడియా చిన్నారుల నిద్రకు, ఆటలకు, ఆఖరికి కుటుంబంతో గడిపే సమయాన్ని కూడా దూరం చేస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యంపై హానికరమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు మన మద్దతు అవసరం. అందుకే, 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించాలని ప్రభుత్వం నేడు నిర్ణయించింది అని కీర్ స్టార్మర్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన కొన్ని కంపెనీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. కానీ మేము వాటిని ఎదుర్కొంటాం. ఎందుకంటే ఈ నిర్ణయం తీసుకోవాల్సిన అత్యంత అవసరంగా మా ముందుకొచ్చింది. మన పిల్లలకు సంతోషం లేకుండా.. భద్రత లేకుండా సోషల్ మీడియా చేస్తోంది. మన పిల్లలు మరింత పటిష్టమైన, న్యాయమైన బ్రిటన్‌లో వారు సంతోషకరమైన, సురక్షితమైన బాల్యాన్ని పొందడానికి అర్హులు అని వీడియో సందేశంలో కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. బ్రిటన్ సోషల్‌మీడియాను నిషేధం విధించిన దేశాల జాబితాలో చేరింది. జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలు సోషల్ మీడియాపై నిషేధం విధించింది. ఇక స్పెయిన్, డెన్మార్క్‌లు ఈ నిర్ణయంపై ఆలోచిస్తున్నాయి.

## పెన్నులు కొనుగోలు చేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!




లక్నో: వేసవి సెలవులు ముగిశాయి. స్కూళ్లు, కాలేజీలు తెరుచుకున్నాయి. కావాల్సిన బ్యాగ్స్,బుక్స్, పెన్నులు కొనుగోలు చేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్టేషనరీ షాపులకు క్యూకట్టారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ పోలీస్‌శాఖ రాష్ట్ర ప్రజల్ని అప్రమత్తం చేసింది. స్టేషనరీ షాపుల్లో కొనుగోలు చేసే పెన్నుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. పెన్నుల్లా కనిపించేవన్నీ పెన్నులు కాదని.. సంఘ విద్రోహ శక్తులు పెన్నులకు బదులు..వాటి ఆకారంలో ఉండే బాంబుల్ని తయారు చేశారని తెలిపింది. అందుకు సంబంధించిన ఫొటోల్ని విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో పెన్ ఆకారంలో ఉన్న అనుమానాస్పద వస్తువులపై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. బులంద్‌షహర్ జిల్లా పోలీసులు (ఖుర్జా పోలీస్ స్టేషన్ పరిధి) ఈ అడ్వైజరీని విడుదల చేశారు. పెన్‌లా కనిపించే అనుమానాస్పద వస్తువులను తాకరాదని ప్రత్యేక సూచనలు చేశారు. ఇవి విస్ఫోటక పరికరాలుగా మార్పిడి చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు రోడ్లపై, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో లేదా ఎడారిలాంటి ప్రాంతాల్లో కనిపించే వస్తువులను తాకకుండా 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారం అత్యంత కీలకమని, శిక్షణ పొందిన భద్రతా సిబ్బందే ఇలాంటి వస్తువులను పరిశీలించాని తెలిపారు. ప్రజలు సూచనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

# ఏమున్నది గర్వకారణం?



ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టి పన్నెండేళ్లు పూర్తయ్యాయి. వరుసగా మూడోసారి అధికారంలో కొనసాగుతున్న ఆయన, స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా పనిచేసిన నాయకునిగా చరిత్ర సృష్టించినట్లు చెప్తున్నారు. 1952 నుంచి జవహర్‌లాల్ నెహ్రూ పాలనను సాంకేతికంగా లెక్కించి ఆ రికార్డును బుధవారం నాడు మోడీ అధిగమించినట్లు ప్రచారం చేస్తున్నారు. 1947 నుంచి ఐదేళ్ల పాటు సాగిన నెహ్రూ పాలనను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. ఈ చర్యతో మోడీని తిరుగులేని నాయకునిగా చిత్రీకరించడానికి సంఘ్‌పరివార్, బిజెపి, వాటి అనుబంధ సంస్థలు, గోడీ మీడియా ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, ఈ ప్రచార హోరును పక్కనబెట్టి ఈ పన్నెండేళ్ల పాలన దేశ ప్రజల జీవితాలపై ఎలాంటి ముద్ర వేసిందన్నది పరిశీలిస్తే ఏమున్నది గర్వకారణమన్న మహాకవి మాటలే గుర్తుకువస్తాయి. మోడీ పాలన అనగానే 2016 నవంబరు 8న ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయం తొలుత గుర్తుకొస్తుంది. ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా కుదిపేసింది. అసంఘటిత రంగం, చిన్న పరిశ్రమలు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు కోలుకోలేని దెబ్బతిన్నారు. బ్యాంకుల ముందు క్యూలలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు దేశ ప్రజలకు ఎప్పటికీ పీడకలే! అకస్మాత్తుగా ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ లక్షలాది వలస కార్మికులను రోడ్డున పడేసింది. వందల కిలోమీటర్లు కాలినడకన స్వగ్రామాలకు వెళ్లిన వారి దృశ్యాలు మనదేశ సామాజిక వాస్తవికతను ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టాయి. రెండో దశ కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత, పడకల లభ్యత లేకపోవడం, ఔషధాల కొరత కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గంగానదిలో తేలిన మృతదేహాలు, శ్మశానాల్లో కనిపించిన భయానక దృశ్యాలు ప్రభుత్వ వైఫల్యాలకు ప్రతీకలుగా మిగిలిపోయాయి. ఆర్థిక రంగంలోనూ మోడీ పాలన సాధించిన ఘన విజయాలు దాదాపు శూన్యం! రోజురోజుకి కృంగి కృశించి పోతున్న రూపాయి విలువే దీనికి నిదర్శనం. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పెరిగిన ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను ఘోరంగా దెబ్బతీశాయి. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల నిజ ఆదాయాలు అందుకు అనుగుణంగా పెరగడంలేదు. కార్పొరేట్ సంస్థలకు భారీ పన్ను రాయితీలు, రుణాల మాఫీలు ప్రకటిస్తూనే, సామాన్యులపై పరోక్ష పన్నుల భారం మోపిన ఘనత నరేంద్రమోడీ ప్రభుత్వానిది. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల లాభాలే లక్ష్యంగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రైతులపై రుద్దడానికి చేసిన ప్రయత్నం దేశ చరిత్రలోనే అతి పెద్ద రైతాంగ ఉద్యమానికి దారితీసింది. విదేశాంగ విధానంలోనూ 'విశ్వగురు'వంటి ప్రచార యావ తప్ప, జాతీయోద్యమ వారసత్వంగా నెలకొల్పిన విలువలను మంట గలిపిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కింది. ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు క్షీణించాయి. అన్ని రంగాల్లోనూ అమెరికా అడుగులకు మడుగులొత్తడమే లక్ష్యంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడులపట్ల మన దేశ వైఖరే దీనికి నిదర్శనం. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చడం, ప్రజాసామ్య విలువలను తుంగలో తొక్కడంలో గత ప్రభుత్వాలతో పోలిస్తే మోడీ సర్కారుదే పై చేయి! పార్లమెంటు చర్చల సంప్రదాయం క్షీణించింది. దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రత్యర్థులను, మేధావులను, లౌకిక వాదులను, అభ్యుదయ శక్తులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఎన్నికల కమిషన్‌తో పాటు న్యాయవ్యవస్థ స్వతంత్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో సమాఖ్య స్ఫూర్తిని ఘోరంగా దెబ్బతీశారు. హిందూ మతోన్మాదం, మైనారిటీలపై విద్వేష ప్రచారం, గోగూండాల దాడులు, విద్వేష ప్రసంగాలు దేశ స్వాతంత్ర్య పోరాటం నిర్మించిన లౌకిక, బహుళత్వ విలువలకు సవాల్‌గా మారాయి. ఈ వాస్తవ పరిస్థితిని మోడీ ప్రచార యంత్రాంగం మసిపూసి మారేడు కాయ చేస్తోంది. అయితే, ఈ పరిస్థితి ఎల్ల కాలం సాగదు. నాయకుల్ని వారి వాగాడంబరంతో కాకుండా, వారు సాధించిన ఫలితాలతోనే చరిత్ర అంచనా వేస్తుంది. నిరుద్యోగంతో నిస్సహాయులైన యువతరం, లేబర్ కోడ్‌లతో భద్రత కోల్పోయిన కార్మికులు-ఉద్యోగులు, భవిష్యత్తుపై బెంగలో చిక్కుకున్న రైతాంగం, మనువాద శక్తుల విజృంభణతో నిస్సహాయులుగా మారుతున్న మహిళలు, దళితులు, మైనార్టీలు...ఇవి చాలవా... పన్నెండేళ్ల కార్పొరేట్-మతతత్వ కూటమి పాలన ఘనతను అర్థం చేసుకోవడానికి!

# ప్రజా పాత్రికేయ విజయం




ప్రజా పాత్రికేయుడు, న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థపై పెట్టిన కేసులను రద్దు చేస్తూ, ఈనెల పదో తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం. ఈ కేసుల బనాయింపు, కొనసాగింపూ "చట్ట ప్రక్రియ దుర్వినియోగం"గా మారిందని కోర్టు వ్యాఖ్యానించటం మోడీ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. మూడు సంవత్సరాలకు పైగా సాగిన దర్యాప్తులు, దాడులు, అరెస్టులు, కోర్టు విచారణల అనంతరం వచ్చిన ఈ తీర్పు ఒక వ్యక్తి విముక్తి మాత్రమే కాదు. మోడీ-అమిత్ షా ప్రభుత్వపు అణచివేతపై ప్రజాస్వామ్య విలువలు సాధించిన విజయం. ప్రజా పాత్రికేయం ఎగురవేసిన గెలుపు పతాకం! ప్రబీర్ పుర్కాయస్థకు ఈ నిర్బంధమూ, అధికార దురహంకారం చేసే దాడీ కొత్త కాదు. 1975 ఎమర్జెన్సీ కాలంలో జెఎన్‌యు విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన్ని దురుద్దేశపూర్వకంగా అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం మీసా చట్టం కింద అరెస్టు చేసింది. వేరొక విద్యార్థి నాయకుడిని వెతుక్కుంటూ వచ్చిన ఢిల్లీ పోలీసులు తోటి విద్యార్థులతో ఉన్న ప్రబీర్‌ను బలవంతంగా ఎత్తుకుపోయారు. అప్పటికప్పుడు తప్పుడు కేసులు బనాయించి జైలులో నిర్బంధించారు. తరువాత జనతా ప్రభుత్వం నియమించిన జస్టిస్ షా కమిషన్ ఈ ఉదంతంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "అపరిమితమైన అధికార దురహంకారం, అధికారుల వెన్నెముకలేనితనం కలిస్తే ఏమి జరుగుతుందో ఈ ఘటన తెలియజేస్తుంది" అని చీవాట్లు పెట్టింది. "ప్రధాని నివాసంలో ఎవరినో సంతృప్తిపరచడానికే ఈ అరెస్టు జరిగింది" అని కూడా పేర్కొంది. అధికార దుర్వినియోగం, అధికారుల లొంగుబాటు కలిసి ప్రజాస్వామ్య వ్యవస్థపై శాశ్వత మచ్చ వేస్తాయని హెచ్చరించింది. దాదాపు 48 ఏళ్ల తరువాత 2023లో మళ్లీ అదే జరిగింది. ఏ ఆధారాలు లేకుండానే ఆరోపణలు గుప్పించి ప్రబీర్‌ను 220 రోజులకు పైగా జైల్లో ఉంచింది మోడీ-షా ప్రభుత్వం. పాలకుల కనుసన్నల్లో దర్యాప్తు సంస్థలు ప్రబీర్ మీద చేసిన కేసుల బనాయింపులు, ఆరోపణలు చాలా దారుణం. ఆయన విదేశీ నిధులు పొంది జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే చర్యలు చేపట్టారని దుర్మార్గమైన కేసులు పెట్టారు. ప్రబీర్ ప్రజాపక్షాన తన జీవితాన్ని అంకితం చేసుకున్న గొప్ప మేధావి, ఇంజనీరు. ఉద్యోగాన్ని వదులుకొని న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్ ద్వారా ప్రజా జర్నలిజం వైపు నిలిచారు. ప్రధాన స్రవంతి మీడియా విస్మరించిన అనేక ప్రజా సమస్యలను, ఉద్యమాలను వెలుగులోకి తీసుకొచ్చారు. 2020-21లో నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన మహోద్యమాన్ని అనేక క్షేత్రస్థాయి కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగం, ప్రజారోగ్యం, విద్య, ఆర్థిక అసమానతల వంటి అంశాలపై కథనాలు ప్రచురించారు. ప్రధాన మీడియాలో అత్యధిక భాగం తమ కాళ్ల ముందు సాగిలపడుతున్న దశలో, ప్రబీర్ పోర్టల్ ద్వారా ఎదురు నిలవడం మోడీ ప్రభుత్వానికి కంటగింపుగా తయారైంది. ఎలాగైనా అణచివేయాలని 2021 నుంచే వివిధ రూపాల్లో ప్రయత్నించి, విఫలమైంది. 2023లో ఓ అమెరికా పత్రిక ప్రచురించిన తాడూ బొంగరం లేని ఒక కథనాన్ని నెపంగా తీసుకొని, న్యూస్‌క్లిక్ కార్యాలయంపైనా, అందులో పనిచేసే జర్నలిస్టులు, రచయితలు, పరిశోధకులు, కార్యకర్తల ఇళ్లపైనా దాడులకు తెగబడింది. ప్రబీర్ పుర్కాయస్థ, సంస్థ హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిపై ఉపా చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేసింది. 2024 మే 15న సుప్రీంకోర్టు ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని ప్రకటించింది. ఇది కేసుకు మొదటి పెద్ద ఎదురుదెబ్బ. ఢిల్లీ హైకోర్టు ఇప్పుడు ఆ కేసునే కొట్టిపారేసింది. భారతదేశంలో దిగజారిన పత్రికా స్వేచ్ఛకు న్యూస్‌క్లిక్‌పై దాడి ఒక ఉదాహరణ. సిద్ధిక్ కప్పన్, మహ్మద్ జుబైర్ వంటి జర్నలిస్టులపైనా కేసులు బనాయించి జైల్లో బంధించటం, ప్రజాపక్షాన నిలిచే మీడియా సంస్థలపై దాడులు జరపటం వంటి పాలకుల కక్షపూరిత చర్యలు ఇంకెన్నో ఉన్నాయి. 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో 180 దేశాల మధ్య భారత్ స్థానం 157లో ఉండడం సిగ్గుచేటు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను హామీ ఇస్తోంది. భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం, ప్రభుత్వాన్ని విమర్శించడం, ప్రజా ఉద్యమాల వార్తలను ప్రజలకు చేరవేయడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ. జాతీయ భద్రత పేరుతో ఆ హక్కులను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తాజా తీర్పు చట్టాన్ని రాజకీయ ఆయుధంగా ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా తన కక్షపూరిత వైఖరిని, నిరంకుశ ధోరణులను విడనాడాలి. లేకుంటే ఇలాగే పరాభవాలు ఎదురవుతాయి.

# ఎంత దారుణం..!



ఒమన్ తీరం లోని చమురు నౌక పై క్షిపణి దాడి చేసి ముగ్గురు భారత నావికుల్ని పొట్టనబెట్టుకున్న అమెరికా దుశ్చర్య గర్హనీయం. ప్రాణాలు కోల్పోయిన ముగ్గురిలో ఒకరైన పట్నాల సురేష్ విశాఖ వాసి కావడం మరింత బాధాకరం. వీరు పౌర నావికులే తప్ప సైనికులు కారు. ఈ ఘటన పౌర నౌకాయానానికి పెరుగుతున్న ప్రమాదానికి హెచ్చరిక. ఆ నౌకలో ఇరాన్ చమురు రవాణా చేయడంలేదని దాని యజమానులు స్పష్టం చేసినా ఇరాన్ నుండి చమురు కొన్నారన్న నెపం మోపి అమెరికా దాడికి పాల్పడడం దురహంకారానికి నిదర్శనం. భారత వాణిజ్య నౌకలపై అమెరికా నావికాదళం ఈ వారం రోజుల్లోనే మూడుసార్లు దాడి చేసింది. ఘనత వహించిన నరేంద్ర మోడీ సర్కారు అమెరికా ఆంక్షలకు లోబడి ఉన్నప్పటికీ భారత నౌకలపై దాడి చేయడం భారత్ పట్ల ట్రంప్ సర్కారుకు ఎంత చిన్నచూపో విదితమవుతోంది. మన సార్వభౌమాధికారాన్ని సవాలు చేసేలా ముగ్గురు నావికుల్ని బలి తీసుకున్న అమెరికా ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వం లొంగుబాటు వైఖరి ప్రదర్శించడం అవమానకరం. పశ్చిమాసియాలో అమెరికా దాడులను భారత ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలి. ఈ దాడికి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా భారత ప్రభుత్వం వ్యవహరించాలి. అమెరికా ఇజ్రాయిల్ సాగిస్తున్న దుర్మార్గాలను శాంతికాముకులు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలనే ప్రతి ఒక్కరూ ఖండించాలి. భారత నావికులున్న నౌకపై అమెరికా దళాలు చేసిన దాడి పై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరపాలి. సంఘర్షణ ప్రాంతాల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, వాణిజ్య నౌకలకు పటిష్టమైన నావికాదళ రక్షణ, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సి ఐ టి యు సహా వివిధ సంస్థలు చేస్తున్న డిమాండ్ సబబైనది. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, నౌకా యజమానులు, అలాగే నావికుల సంఘాలతో శాశ్వత సంక్షోభ నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ దాడిలో చనిపోయిన నావికా సిబ్బంది కుటుంబాలకు పరిహారం, బీమా మొత్తాన్ని సకాలంలో అందించి, వారిపై ఆధారపడిన వారికి శాశ్వత ఉపాధి కల్పించాలి. అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో పనిచేస్తున్న నావికులకు తప్పనిసరి యుద్ధ-ప్రమాద భత్యం, మెరుగైన బీమా కవరేజీని అందించాలి. సురక్షిత సముద్ర మార్గాలను ఏర్పాటు చేయడం, సంఘర్షణ ప్రభావిత జలాల్లో ప్రయాణాలను సమీక్షించడం, వాణిజ్య నౌకాయానం, పౌర నావికులను రక్షించడానికి అంతర్జాతీయ వేదికలపై బలమైన దౌత్యపరమైన చర్యలు చేపట్టడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. లేకపోతే మన నావికులకు భద్రత ఉండదు. పశ్చిమాసియా లో అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మూలంగా భారత్ తో సహా ప్రపంచ దేశాలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇంధన సంక్షోభం పర్యవసానంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. కాబట్టి ఈ యుద్ధాన్ని, అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షను యావత్ ప్రపంచం వ్యతిరేకించాలి. కానీ మన కేంద్ర ప్రభుత్వం మాత్రం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా వ్యవహరిస్తూ దాని దురాగతాల్ని వివిధ సందర్భాల్లో వెనకేసుకు రావడం దారుణం. మనకు చౌకగా చమురు గ్యాస్ సరఫరా చేసిన దీర్ఘ కాల మిత్ర దేశం ఇరాన్ తో సంబంధాలు చెడగొట్టుకోవడంతో సహా పలు దౌత్య వైఫల్యాలకు పాల్పడింది. అయినా తాజాగా అమెరికా మన నావికులపై చేసిన దాడిని ఇరాన్ ఖండించి మిత్రత్వాన్ని చాటుకుంది. దేశం ఇంధన సంక్షోభంలో చిక్కుకోవడం మోడీ ప్రభుత్వ స్వయంకృతాపరాధమేనన్న ఆర్థిక నిపుణుల మాట ప్రత్యక్షర సత్యం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ విధానాన్ని మార్చుకొని భారత సార్వభౌమత్వాన్ని సమున్నతంగా నిలపాలి. అందుకోసం ప్రజల నుండి ఒత్తిడి పెరగాలి. ఆ దిశగా ప్రగతికాముక శక్తులు కృషి చేయాలి. అమెరికా, ఇజ్రాయిల్ తో సహా వివిధ దేశాల్లో సాగుతున్న యుద్ధ వ్యతిరేక వాతావరణం భారత్ లో అభివృద్ధి కావాలి.

## బాల్య వివాహాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు



హైదరాబాద్: బాల్య వివాహాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. మంత్రి సీతక్క సమక్షంలో ప్రభుత్వం, తరుణి సంస్థ మధ్య ఎంఓయూ కుదిరింది. బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించింది. "బాల్య వివాహం-బతుకు ఆగం" నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయనుంది ప్రభుత్వం. సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జరుగుతాయి. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... "బాల్య వివాహం కుటుంబ సమస్య మాత్రమే కాదు.. సామాజిక సమస్య. బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. బాల్య వివాహాల వల్ల బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతుంది. బాల్య వివాహాలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. బాలికల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం పడుతోంది. 'బాల్య వివాహం--బతుకు ఆగం' నినాదంతో ప్రచారం నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని మరింత విస్తరిస్తాం. బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతాం. బాలికలకు హక్కులు, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పిస్తాం. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందిస్తాం. బాల్య వివాహాల దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తాం. బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించాలి. బాల్య వివాహాలకు ముగింపు పలకడానికి అందరూ కలిసి పనిచేయాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం సమష్టిగా ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

## వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు తీవ్ర అన్యాయం




తెలంగాణ : సింగరేణి వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పరిధిలోని కాసిపేట గనిపై సోమవారం నిర్వహించిన 'బొగ్గుబాయి' బాట గేట్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సింగరేణి సంస్థ మనుగడను, కార్మికుల ప్రయోజనాలను కాపాడుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. సంస్థ పరిరక్షణ కోసం టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసికట్టుగా ముందడుగు వేస్తున్నాయని కవిత తెలిపారు. కార్మికులకు అనుకూలంగా విధానాలు, పాలసీలను రూపొందించాల్సిన ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులే స్వయంగా అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారే ఇలాంటి చర్యలకు పాల్పడుతూ కార్మిక రంగాన్ని పూర్తిగా మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ తీరు కార్మికులను మోసం చేసేలా ఉందే తప్ప, వారి సమస్యలను పరిష్కరించేలా లేదని విమర్శించారు. సింగరేణి సంస్థకు ఉన్న ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, దానిని ప్రైవేటీకరించడానికి తెరవెనుక పెద్ద కుట్రలు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. లాభసాటిగా ఉన్న అండర్ గ్రౌండ్ మైన్లను (భూగర్భ గనులను) ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం హెచ్ఎంఎస్ అనుబంధ కార్మిక సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ప్రకటించారు. కార్మికుల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## మెట్రో రైలు నిర్మాణంలో ఇతర నగరాలు ముందున్నాయి




తెలంగాణ : మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కెసిఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. "రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో బిజెపి కి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా ? కెసిఆర్, కెటిఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కెసిఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడి హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోడి రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## అభిజీత్ దిప్కేపై దాడి.. అసలు ఏం జరిగిందంటే?

సోషల్ మీడియా వేదికగా పుట్టుకొచ్చి, అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఊహించని చేదు అనుభవం ఎదురైంది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో నిర్వహిస్తున్న ఒక నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనపై ఓ గుర్తుతెలియని వ్యక్తి దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా, విద్యార్థులకు మద్దతుగా కాక్రోచ్ జనతా పార్టీ జైపూర్‌లోని అమరవీరుల స్మారక మందిరం (శహీద్ స్మారక్) సమీపంలో ఒక భారీ ధర్నాను చేపట్టింది. ఈ నిరసనలో పాల్గొనడానికి అభిజీత్ దీప్కే వేదికపైకి రాగానే, అక్కడే మాటువేసిన ఒక గుర్తుతెలియని వ్యక్తి హఠాత్తుగా ఆయనపై భౌతిక దాడికి దిగాడు. ఈ ఊహించని పరిణామంతో అప్రమత్తమైన అభిజీత్ మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు తక్షణమే స్పందించి దాడి చేసిన వ్యక్తిని అక్కడికక్కడే పట్టుకుని చితకబాదారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ దాడి వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? దాడికి గల కారణాలేమిటి? అనే విషయాలపై పోలీసులు ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు. కేవలం ఒక చిన్న మాటతో, వ్యంగ్య ఉద్యమంగా సోషల్ మీడియాలో ప్రారంభమైన ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ', కొన్ని రోజుల్లోనే కోట్ల మంది ఫాలోవర్లను సంపాదించుకుని దేశంలోనే అతిపెద్ద యువజన శక్తులలో ఒకటిగా ఎదిగింది. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, ప్రభుత్వ వైఫల్యాలపై సూటిగా ప్రశ్నిస్తూ ఈ పార్టీ యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది.

# 'డూప్'మైన్ ఆన్‌లైన్ షాపింగ్!



ఆన్‌లైన్ షాపింగ్ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి? కొత్త వస్తువులను చూడటం, వాటిని వెంటనే కార్ట్‌లో యాడ్ చేయడం, పార్శిల్ ఎప్పుడు వస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూడటం.. ఇదంతా ఒక తీపి అనుభూతి. అయితే, ఈ అలవాటు జేబుకు బాగానే చిల్లు పెడుతుంటుంది. ఎంత ఖర్చు చేస్తున్నామో కూడా తెలియకుండా షాపింగ్ చేసేస్తుంటాం. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా దక్షిణ కొరియా యువత ఇప్పుడు ఒక వినూత్నమైన మార్గాన్ని ఎంచుకుంది. అదే డోపమైన్ సైట్లలో షాపింగ్ చేయడం. ఆ విశేషాలేంటో చూద్దామా? నిజానికి ఆన్‌లైన్‌లో వస్తువులు కొనేటప్పుడు.. వాటిని కొనడం వల్ల వచ్చే ఆనందం కంటే.. దానిని వెతికి, కార్ట్‌లో వేసి, ఆర్డర్ బటన్ నొక్కే ప్రక్రియలోనే మన మెదడులో 'డోపమైన్'(ఆనందాన్నిచ్చే హార్మోన్) ఎక్కువగా విడుదలవుతుందని సైకాలజిస్టులు చెబుతుంటారు. కొరియాలో వచ్చిన ఈ ఫేక్ డోపమైన్ యాప్స్ సరిగ్గా ఇదే సూత్రాన్ని వాడుకుంటున్నాయి. ఈ యాప్స్ చూడటానికి వంద శాతం అసలైన షాపింగ్ సైట్ల లాగే ఉంటాయి. ఇందులో వందలాది ప్రొడక్ట్స్, వాటి రేటింగ్‌లు, కస్టమర్ రివ్యూలు, డిస్కౌంట్ ఆఫర్లు అన్నీ ఉంటాయి. మీకు నచ్చిన దుస్తులు లేదా గాడ్జెట్స్‌ను సెలెక్ట్ చేసుకుని 'కార్ట్'లో వేసుకోవచ్చు. ఆ తర్వాత మీ అడ్రస్ ఎంటర్ చేసి 'ఆర్డర్'బటన్ కూడా నొక్కవచ్చు. ట్విస్ట్ ఏంటంటే మీరు ఆర్డర్ నొక్కగానే స్క్రీన్ మీద ఒక డెలివరీ బాయ్ మీ ఆర్డర్‌ని తీసుకుని, బైక్ మీద మీ ఇంటి వైపు వస్తున్నట్లు మ్యాప్‌లో లైవ్‌గా చూపిస్తుంది. వస్తువు మీ ఇంటికి చేరేవరకు ఉండే ఆ ఉత్కంఠ, ఎగ్జైట్‌మెంట్ అన్నీ నిజంగానే అనిపిస్తాయి. కానీ చివరకు మీ ఇంటికి ఎలాంటి వస్తువూ రాదు, మీ బ్యాంక్ అకౌంట్ నుంచి ఒక్క రూపాయి కూడా కట్ అవ్వదు! దీంతో షాపింగ్ ఖర్చు నుంచి తప్పించుకోవడంతో షాపింగ్ చేశామన్న అనుభూతినీ పొందవచ్చు. అయితే ఈ పద్ధతి డబ్బును ఆదా చేస్తున్నప్పటికీ, ఇది ఒక రకమైన మానసిక వ్యసనానికి దారితీయవచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఏ వస్తువు కొనకపోయినా, ఈ సైట్లలో గడపడం వల్ల షాపింగ్ చేయాలనే అదే ప్రవర్తనా సరళి మెదడులో బలోపేతం అవుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ట్రెండ్ దక్షిణ కొరియాకే పరిమితమైంది. రెడ్డిట్ వంటి సోషల్ మీడియా వేదికలపై ఉన్న వ్యాఖ్యలను బట్టి చూస్తే, పాశ్చాత్య దేశాల వారు తమ సమయాన్ని ఇలాంటి నకిలీ పనుల కోసం వె చ్చించడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదని అర్థమవుతోంది. ఏదేమైనా, షాపింగ్ పిచ్చిని వదిలించుకోవడానికి కొరియన్లు కనిపెట్టిన ఈ మార్గం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. పైసా ఖర్చు లేకుండా షాపింగ్ మజాను అందించే ఈ 'ఫేక్ స్టోర్స్'ఐడియా మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# ఫ్లెక్స్ ఫ్యూయల్.. 'పంచ'నామా




ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు.. ఇటు మారుతి సుజుకి ఓ కారును మార్కెట్లోకి తెస్తే.. అటు హీరో కంపెనీ బైక్‌లను దించింది. ఇదే సమయంలో ఢిల్లీలో ఈ85 పెట్రోలు బంకు కూడా ప్రారంభమైంది. ఈ పరిణామాలను ఇథనాల్ ఆధారిత రవాణా వ్యవస్థ దిశగా మన దేశం వేసిన ఓ కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఈ ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీ ఏమిటి? ఇది ప్రాచుర్యం పొందుతుందా? ఉన్న సమస్యలు ఏమిటి? వంటి వివరాలు మీ కోసం..

### అసలు ఏంటివి?

పెట్రోలులో ఎంత శాతం ఇథనాల్ కలిపినా నడిచేలా రూపొందించినవే ఈ ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు. మన దేశం విషయానికొస్తే.. ఇంజన్‌కు ఎలాంటి నష్టం చేయకుండా.. ఈ20--ఈ100 ఇంధన మిశ్రమంతో ఇవి నడుస్తాయి. అయితే, ఇథనాల్ లోహాన్ని కరిగించే లేదా తినేసే స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇంజిన్‌కు నష్టం జరగకుండా ఉండేందుకు ఇందులో ప్రత్యేక సెన్సర్లు, ఇథనాల్ నిరోధక ఇంధన పైపులు, సీల్స్‌ను అమరుస్తారు. వాస్తవానికి ఈ సాంకేతికత కొత్తది కాదు. 2000ల ప్రారంభంలోనే ఫోక్స్‌వ్యాగన్ వీటిని బ్రెజిల్‌లో ప్రవేశపెట్టింది. ఇప్పుడక్కడ అమ్ముడయ్యే వాహనాల్లో 80 శాతం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలే కావడం గమనార్హం.

### ప్రజల నుంచి ఆదరణ ఉంటుందా?

ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఈ85 ఇంధనం పెట్రోలుతో పోలిస్తే.. లీటరుకు సుమారు రూ.20 తక్కువకు వస్తోంది. అయితే, ఈ వాహనాల తయారీ వ్యయం అధికంగా ఉండటం వల్ల అమ్మకపు ధరలు కూడా ఎక్కువగా ఉండటం.. ఇథనాల్ మిశ్రమం పెరిగే కొద్దీ మైలేజ్ కొంతమేర తగ్గే అవకాశమున్నందున ఈ అంశాల ప్రభావం వినియోగదారులపై పడే అవకాశముంది. ఈ వాహనాలపై జీఎస్టీ తగ్గింపు అంశంపై చర్చలు జరిగినప్పటికీ కేంద్రం ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందువల్ల పన్ను రాయితీలతోపాటు ఇథనాల్ మిశ్రమ ఇంధన ధరను కూడా మరింత తగ్గించే దిశగా ప్రోత్సాహకాలు అవసరమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

### మార్కెట్ పరిస్థితి ఏమిటి?

2031--32 నాటికి మొత్తం వాహనాల అమ్మకాల్లో ఫ్లెక్స్ ఫ్యూయల్, హైబ్రిడ్ వాహనాలు కలిపి 5 శాతం వాటాను దక్కించుకుంటాయని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. పశ్చిమాసియా పరిణామాలు, ఉద్గారాల నియంత్రణ లక్ష్యాల నేపథ్యంలో ప్రభుత్వం దీనికి ప్రాధాన్యమిస్తోంది.

### కంపెనీలు ఏమనుకుంటున్నాయి?

ప్రస్తుతం హీరో, మారుతి సంస్థలు పరిమిత స్థాయిలోనే వాహనాలను మార్కెట్లోకి తెస్తున్నాయి. వీటి తయారీ వ్యయం ఎక్కువగా ఉండటం, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై స్పష్టత లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలు. అదే సమయంలో ఇథనాల్ కలిపిన ఇంధనం తక్కువ ధరలో వస్తున్నప్పటికీ.. ఈ వాహనాల ధరలు ఎక్కువగా ఉండటంతో వీటికి ప్రజల ఆదరణ ఎలా ఉంటుందన్న అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది. దీంతో కంపెనీలు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నాయి.

### ఫ్లెక్స్ ఫ్యూయల్ సరఫరా తగినంత ఉందా?

ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఆల్ ఇండియా డిస్టిలర్స్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం.. భారత్ ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 2,000 కోట్ల లీటర్లు. ప్రస్తుతమున్న 20 శాతం ఇథనాల్ మిశ్రమ ఇంధన లక్ష్యానికి అవసరమయ్యే పరిమాణం(1,100 కోట్ల లీటర్లు) కంటే ఇది ఎక్కువ. భవిష్యత్తులో ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల వినియోగం పెరిగినా.. ఈ మేరకు సరఫరాను పెంచే సామర్థ్యం పరిశ్రమకు ఉందని నిపుణులు చెబుతున్నారు.

# లోకో భిన్నరుచి.. ఏఐతో గుదిగుచ్చి...

**రుచుల భారతాన్ని ప్రతిబింబించే మ్యాప్ కోసం కసరత్తు**
**ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో పరిశోధన**
**దేశంలోని స్థానిక రుచుల వివరాలతో రూపొందుతున్న భారత్ టేస్ట్ అట్లాస్**



హైదరాబాద్: తమిళనాడు ఇడ్లీ--సాంబార్, ఫిల్టర్ కాఫీకి ఫేమస్.. హైదరాబాద్ పేరు చెప్పగానే నోరూరించే దమ్ బిర్యానీ గుర్తొస్తుంది. ఇలా దేశంలోని వేర్వేరు ప్రాంతాల ప్రత్యేక రుచులు, వంటకాలు, విభిన్న తయారీ పద్ధతులకు డిజిటల్ రూపం ఇచ్చేందుకు భాగ్యనగరం వేదికగా కసరత్తు జరుగుతోంది. ఆయా వంటకాల్లోని పదార్థాల కల యిక, వంట విధానం సహా ప్రాంతానికో రుచి కలిగిన భారతీయ రుచులను సాంకేతికంగా గుర్తించేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలోని సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరిశోధన సాగుతోంది. ఇండియన్ ఫుడ్ మ్యాప్ తయారీ లక్ష్యంగా ప్రొఫెసర్ సీవీ జవహర్ సారథ్యంలో జరుగుతున్న ఈ అధ్యయనంలో కంప్యూటర్ విజన్, ఏఐ సాంకేతికతలను ఉపయోగించి భారతీయ ఆహార ప్రత్యేకతలను పరిశోధక బృందం విశ్లేషిస్తోంది.

### థాళీ... భళీ...

ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధకులు తొలుత భారతీయ థాళీ'పై అధ్యయనం ప్రారంభించారు. సాధారణంగా భారతీయ భోజనంలో అన్నం, పప్పు, కూరలు, రొట్టెలు, పెరుగు, పచ్చళ్లు వంటి అనేక పదార్థాలు కలిసిపోవడం వల్ల వాటి పోషక విలువలను గుర్తించడం ప్రస్తుత యాప్‌లకు కష్టమవుతోంది. పాశ్చాత్య దేశాల ఆహారాన్ని గుర్తించేందుకు తయారైన చాలా ఫుడ్ ట్రాకింగ్ యాప్‌లు భారతీయ వంటకాల వైవిధ్యాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదని పరిశోధకులు గుర్తించారు. దీనికి పరిష్కారంగా జీరో--షాట్ ఏఐ సిస్టమ్‌ను అభివృద్ధి చేశారు. ఈ సాంకేతికత కొత్త వంటకాలను ప్రత్యేక శిక్షణ అవసరం లేకుండానే గుర్తించి, విశ్లేషిస్తుంది.

### బిర్యానీపై స్పెషల్ స్టడీ

హైదరాబాదీ, అవధీ, అంబూర్, కోల్‌కతా వంటి బిర్యానీ రకాల్లో ఉపయోగించే మసాలాలు, వంట దశలు, పదార్థాల మార్పులను ఏఐ ప్రత్యేకంగా విశ్లేషిస్తోంది. ఈ ప్రాజెక్టు కేలరీలు లెక్కించే సాధనంగా మాత్రమే కాకుండా భారతీయ ఆహార సంస్కృతిని డిజిటల్ రూపంలో భద్రపరిచే ప్రయత్నంగా కూడా మారనుంది. ప్రస్తుతం ఈ సిస్టమ్ ఓవర్‌హెడ్ కెమెరా సహాయంతో పనిచేస్తుండగా భవిష్యత్తులో మొబైల్ యాప్ రూపంలో అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఫోన్ కెమెరాతో భోజనం ఫొటో తీస్తే అందులోని పదార్థాలు, వాటి పరిమాణం, పోషక విలువలను కూడా ఏఐ అంచనా వేస్తుందని బృందం చెబుతోంది.

### లాభాలివీ..

ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగదారులు దేశ ఇంటరాక్టివ్ మ్యాప్‌ను అన్వేషిస్తూ వివిధ ప్రాంతాల సంప్రదాయ వంటకాలను తెలుసుకోగలరు.

ప్రతి వంటకం మూలాలు, పదార్థాలు, సాంస్కృతిక ప్రాధాన్యం, తయారీ విధానంతోపాటు వాటిని అందించే రెస్టారెంట్ల గురించి కూడా సమాచారం పొందగలరు.

కొత్త వంటకాలను తెలుసుకోవాలనుకునే ఆహార ప్రియులకు ఇది దోహదపడటంతోపాటు పర్యాటకులకు అసలైన స్థానిక ఆహార అనుభవాలను కనుగొనడంలో సహాయపడుతుంది.

భారతీయ ఆహార వారసత్వంపై ఆసక్తి ఉన్న పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థలకు ఇది ఉపయుక్తమైన వనరుగా ఉంటుంది.

### ఏఐ ఆధారిత పరిష్కారాలకు దోహదం

సమాచార సేకరణ, వర్గీకరణ కోసం ఏఐ సాధనాలను వినియోగించి అనంతరం ధ్రువీకరణ, భౌగోళిక మ్యాపింగ్ కోసం ప్రత్యేక విధానాలను అభివృద్ధి చేశాం. దీంతో వినియోగదారులకు సులభంగా ఉపయోగపడే ఇంటరాక్టివ్ వేదికను రూపొందించగలిగాం. ఈ డేటా వల్ల రుచులు, పోషకాలు, వినూత్న పద్ధతులపై సాంకేతిక విశ్లేషణ సాధ్యమవుతుంది. దీని ద్వారా భారతీయ ఆహార రంగంలో ఏఐ ఆధారిత పరిష్కారాలు అభివృద్ధి చెందుతాయి. వంటకాల్లోని వైవిధ్యాలను, వంటకాల పరిణామ క్రమాన్ని కూడా చేర్చాలని భావిస్తున్నాం.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.